




# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States

సంపుటి : 25 | సంచిక : 52 | మంగళవారం.26-5-2026 | విజయవాడ | మంగళవారం | పేజీలు : 8 | వెల : రూ.1/-


## గొడ్డలి పార్టీకి గత ఎన్నికల్లో ప్రజలు సరైన బుద్ధి చెప్పారు: అచ్చెన్నాయుడు

**అమరావతి, మే 25** :(వార్తా ప్రభ ప్రతినిధి)గత జగన్ ప్రభుత్వం కమీషన్ల కోసం పారిశ్రామికవేత్తలను వేధించి, రాష్ట్ర అభివృద్ధిని పాతాళానికి తొక్కేసిందని మంత్రి అచ్చెన్నాయుడు ఆరోపించారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం చీపుర్లపాడులో రూ.10.51 కోట్లతో నిర్మించనున్న ఎంఎస్ఎంఈ పార్కుకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అధికారంలో ఉండగా 'నాకెంత.. నీకెంత' అంటూ దోచుకున్న ఆ 'గొడ్డలి పార్టీ'కి గత ఎన్నికల్లో ప్రజలే సరైన బుద్ధి చెప్పారని, రాబోయే రోజుల్లో ఆ పార్టీ శాశ్వతంగా తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని జోస్యం చెప్పారు.

# పేదల సేవలో అగ్రభాగాన కూటమి ప్రభుత్వం

● సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీలో దేశంలో ఏపీనే నెంబర్-1 ● 2 ఏళ్ల పాలనలో సుమారు రూ. 65 వేల కోట్లకు పైగా పెన్షన్ల పంపిణీ ● ఐదేళ్లల్లో వైసీపీ ప్రభుత్వం ఖర్చు పెట్టిన మొత్తంలో 71.5 శాతాన్ని 2 ఏళ్లల్లోనే పంపిణీ చేసిన కూటమి సర్కార్ ● రూ. 4000 నుంచి రూ. 15000 వరకు వివిధ వర్గాలకు పెన్షన్లు అందజేత ● దివ్యాంగులకు రెండింతల లబ్ధి చేకూర్చిన కూటమి సర్కార్ ● రికార్డు స్థాయి పెన్షన్ల పంపిణీతో సామాజిక విప్లవం సృష్టించిన ఏపీ ● ప్రతి నెలా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో క్రమం తప్పకుండా పాల్గొంటున్న ముఖ్యమంత్రి

**అమరావతి, మే 25** :(వార్తా ప్రభ ప్రతినిధి)సామాజిక పింఛన్ అంటే కేవలం రూ. 500లో, రూ. 1000 చేతిలో పెట్టే తూతూమంత్రపు ప్రక్రియ కాదు.. అది ఒక నిరుపేద కుటుంబానికి కొండంత అండ, ఆత్మగౌరవ ప్రతీక అనేది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ విధానం. సమాజంలోని అట్టడుగు వర్గాలు, వృద్ధులు, చేరదీసే దిక్కులేని అభాగ్యులు గౌరవప్రదమైన జీవనం సాగించాలనే ఉద్దేశ్యంతో ప్రారంభించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం సరికొత్త చరిత్రను లిఖిస్తోంది. 2 ఏళ్ల పాలనలో రికార్డు స్థాయిలో సుమారు రూ. 65 వేల కోట్లకు పైగా నిధులను లబ్దిదారులకు కూటమి ప్రభుత్వం పంపిణీ చేసింది. దేశంలోని మరే ఇతర రాష్ట్రంలోనూ ఈ స్థాయిలో పెన్షన్ల పంపిణీ చేపట్టడం లేదు. గత ప్రభుత్వం 5 ఏళ్ల కాలంలో రూ. 91 వేల కోట్ల నిధులను పెన్షన్ల రూపంలో ఖర్చు పెడితే... అందులో 71.5 శాతం మేర నిధులను రెండేళ్ల కాలంలోనే కూటమి ప్రభుత్వం పంపిణీ చేపట్టింది. ఉద్యోగులకు ప్రతి నెలా 1వ తేదీన జీతాలు ఇస్తున్నట్టే... సామాజిక భద్రతా పెన్షన్లను అందుకుంటున్న ఎన్టీఆర్ భరోసా లబ్దిదారులకు ఠంచనుగా పెన్షన్ డబ్బులను ఇంటి వద్దకే వెళ్లి అందిస్తున్నారు ప్రభుత్వ సిబ్బంది. క్షేత్ర స్థాయిలో ఉండే స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాలకు చెందిన సిబ్బంది ఉదయం 8-9 గంటల్లోనే సుమారు 75 నుంచి 80 శాతం మేర పెన్షన్ల పంపిణీ పూర్తి చేస్తున్నారు. ఏదైనా నెలలో ఒకటో తేదీ ఆదివారం కానీ.. శెలవు దినం అయితే.. ముందు నెలలోని లాస్ట్ వర్కింగ్ డే రోజునే పెన్షన్ మొత్తాలను లబ్దిదారులకు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది కూటమి ప్రభుత్వం. ప్రభుత్వం ఆర్థికంగా ఎంతో ఇబ్బందులు ఉన్నా... ఇప్పటి వరకు ఒక్క రోజు కూడా జాప్యం చేయకుండా పెన్షన్ల పంపిణీని చేపట్టింది. అలాగే ముఖ్యమంత్రి ప్రతి నెలా క్రమం తప్పకుండా పేదల సేవలో పేరుతో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

**పెన్షన్లల్లో ట్రెండ్ సెట్టర్** అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆర్థిక రక్షణ కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం వేస్తున్న అడుగులు నేడు లక్షలాది మంది జీవితాల్లో సరికొత్త కాంతులు నింపుతున్నాయి. తొలి నుంచి తెలుగుదేశమే పెన్షన్ల విషయంలో ట్రెండ్ సెట్ చేసింది. రాష్ట్రంలో సామాజిక





పింఛన్ల పెంపునకు, తెలుగుదేశం పార్టీ భావజాలానికి విడదీయరాని అనుబంధం ఉంది. ఎన్టీఆర్ హయాం నుంచి ఇప్పటి వరకు లబ్ధిదారుల చేతికి అందే మొత్తాన్ని భారీగా పెంచుతూ వచ్చిన ఘనత ముమ్మాటికీ తెలుగుదేశం ప్రభుత్వాలదే. గత పాలనలో రూ. 1000 పెంచడానికి ఐదేళ్ల సమయం తీసుకుంటే... కూటమి ప్రభుత్వం వచ్చి రావడంతోనే రూ. 1000 పెంచి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంది. బాధ్యతలు స్వీకరించిన తక్షణమే వృద్ధులు, చేనేత, కల్లుగీత కార్మికులు, జానపద కళాకారులకు గతంలో ఉన్న రూ. 3 వేల పింఛన్‌ను రూ. 4 వేలకు పెంచారు. ప్రభుత్వం ఏర్పడిన తొలి నెలలోనే, అంతకుముందు పెరిగిన మూడు నెలల బకాయిలను కలుపుకుని ఏకంగా రూ. 7 వేలను లబ్ధిదారుల ఇళ్ల వద్దకే అందించి మానవతా దృక్పథాన్ని చాటుకుంది కూటమి ప్రభుత్వం. ఇంతటి భారీ పెంపుదల దేశ సామాజిక సంక్షేమ చరిత్రలోనే అపూర్వమైన ఘట్టమనే చెప్పాలి.

**పేద కుటుంబాలకి పెద్ద దిక్కుగా కూటమి ప్రభుత్వం**శాశ్వత వికలాంగులకు, మంచానికే పరిమితమైన వారికి రూ. 15 వేల పెన్షన్ కొండంత అండగా నిలుస్తోంది. శారీరక వైకల్యంతో బాధపడుతున్న దివ్యాంగుల పట్ల ప్రస్తుత కూటమి ప్రభుత్వం చూపిన శ్రద్ధ చూపెడుతోందనే ప్రశంసలు కూటమి ప్రభుత్వానికి అందుతున్నాయి. దివ్యాంగుల పింఛన్ మొత్తాన్ని గతంలో ఉన్న రూ. 3 వేల నుంచి రెట్టింపు చేసి నెలకు రూ. 6 వేలకు పెంచడం ద్వారా వారి కుటుంబాలకు ప్రభుత్వం పెద్ద దిక్కుగా నిలిచింది. అదే విధంగా, కిడ్నీ, లివర్, హార్ట్ మార్పిడి చేయించుకుని నిరంతరం ఖరీదైన మందులపై ఆధారపడే దీర్ఘకాలిక రోగుల పింఛన్‌ను సైతం రూ. 5 వేల నుండి రూ. 10 వేలకు రెట్టింపు చేసి ప్రభుత్వం వారి ప్రాణాలకు భరోసా కల్పించింది.

**పెండింగ్ లేకుండా స్పౌజ్ పెన్షన్లు...**మరణించిన పెన్షనర్ జీవిత భాగస్వామికి రూ. 4 వేల వితంతు పింఛన్‌ను కొత్తగా మంజూరు చేస్తూ ప్రభుత్వం ఇప్పటివరకు 2,14,113 మందికి కొత్తగా లబ్ధి చేకూర్చింది. ఇందుకోసం నెలకు సుమారు రూ. 85 కోట్లకు పైగా ఖర్చు చేస్తోంది. అలాగే, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వరుసగా మూడు నెలలు వివిధ కారణాలతో పెన్షన్ తీసుకోకున్నా... ఆ మొత్తాలను ఒకేసారి తీసుకునే వెసులుబాటు కలిగిస్తోంది ప్రభుత్వం. దీని ద్వారా నవంబర్ 2024 నుండి మే 2026 వరకు 20.23 లక్షల మంది రూ. 1,712.92 కోట్ల బకాయిలను సులభంగా పొందగలిగారు. గత వైసీపీ పాలనలో రకరకాల నిబంధనలు, రాజకీయ ఆంక్షల పేరుతో నిర్దాక్షిణ్యంగా పెన్షన్లల్లో ఎప్పటికప్పుడు కోతలు విధించేది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఎలాంటి ఆంక్షలు లేకుండా అర్హులైన 2.50 లక్షల మందికి కొత్త పింఛన్లు మంజూరు చేసి లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం నింపారు. అంతేకాకుండా, మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పింఛన్ స్థితిగతులు, ఫిర్యాదుల పరిష్కారానికి అత్యాధునిక డిజిటల్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చి లబ్ధిదారుల మొబైల్‌కే నేరుగా సమాధానం పంపే పారదర్శక విధానాన్ని అమలు చేస్తున్నారు.

# సముద్ర సంపద అంది పుచ్చుకుందాము

● తీరప్రాంతం కోతకు గురి కాకుండా రక్షణ చర్యలు
● సముద్రతీర అభివృద్ధిపై నిపుణులతో సీఎం చంద్రబాబు సమావేశం



**అమరావతి, మే 25** :(వార్తా ప్రభ ప్రతినిధి)- ఆంధ్రప్రదేశ్ లోని సముద్ర తీరం అభివృద్ధికి సమగ్ర విజన్ ప్లాన్ తయారు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఆర్థిక కార్యకలాపాల కేంద్రంగా కోస్తాంధ్ర తీరం మారేలా ఈ ప్రణాళికలు ఉండాలని సీఎం సూచించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో సముద్ర తీర అభివృద్ధికి సంబంధించి నిపుణులు, అధికారులతో సీఎం సమావేశం అయ్యారు. ఏపీలో ఉన్న వెయ్యి కిలోమీటర్ల సుదీర్ఘ తీర ప్రాంతంలో అభివృద్ధి ప్రాజెక్టులు, పెట్టుబడులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, మత్స్యకారులకు కలిగే ప్రయోజనాలపై పూర్తి స్థాయి అధ్యయనం నిర్వహించాలని సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా బ్లూ ఎకానమీలో భాగంగా సముద్ర ఆర్థిక వ్యవస్థ గురించే చర్చ జరుగుతోందని.. అపారమైన వనరుల్ని వెలికి తీస్తే విస్తృత ప్రయోజనాలు దక్కే అవకాశం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. ఏపీలో ఆక్వా కల్చర్ అభివృద్ధి చేశామని.. రొయ్యలు, చేపల సాగు, ఎగుమతుల్లో ఏపీ నెంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. ఆక్వా కల్చర్ లో వాల్యూ అడిషన్ జరగాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. దీంతో పాటు ఆక్వా వ్యర్థాలు కాలుష్య కారకంగా మారి పర్యావరణానికి హాని కలిగిస్తున్నాయని అన్నారు. ఈ సవాళ్లను పరిష్కరించేలా పూర్తి స్థాయి అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. అలాగే మెరైన్ బయోడైవర్సిటీని కాపాడేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. సముద్రాలతో పాటు తీరప్రాంతాల్లో దొరికే రేర్ ఎర్త్ మినరల్స్ పై కూడా ఇప్పుడు ప్రత్యేకంగా దృష్టి పెట్టామని.. ఆ వనరుల్ని అందిపుచ్చు కోవాలన్నారు. తీరప్రాంత రక్షణ పైనా ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. తుపాన్ల లాంటి ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేలా సముద్ర తీరాల్లో మడ అడవులు, తాటి చెట్లు లాంటి మూడంచెల సహజ రక్షణ కవచం ఏర్పాటు చేసేలా చూడాలని స్పష్టం చేశారు. పర్యావరణ అనుకూల విధానాలతో పాటు పర్యాటకం, ఆర్థిక కార్యకలాపాల కేంద్రంగా సముద్ర తీరప్రాంతాలు తయారు కావాలని సీఎం దిశానిర్దేశం చేశారు. అలాగే సీ వీడ్ అభివృద్ధి, మార్కెటింగ్ లాంటి అంశాలపై కూడా పరిశీలించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, మత్స్యశాఖ కమిషనర్ నాయక్, రైతు సాధికార సంస్థ వైస్ ఛైర్మన్ విజయ్ కుమార్, మెరైన్ డైవర్సిటీ సంస్థ వోయసీ సంస్థ ప్రతినిధి ఫిలిప్ తదితరులు హాజరయ్యారు.

## డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కళావేదిక ప్రారంభం



**అమరావతి, మే 25** :(వార్తా ప్రభ ప్రతినిధి) విజయవాడలో నూతనంగా నిర్మించిన డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ కళా వేదికను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం ప్రారంభించారు. కళావేదికలో అంబేద్కర్ చిత్రపటానికి సీఎం చంద్రబాబు నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## 'కాలుష్యరహిత గోదావరి పుష్కరాలు' నిర్వహణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది



**రాజమహేంద్రవరం, మే 25** :(వార్తా ప్రభ ప్రతినిధి)'గోదావరి నదిలోకి కలిసే కాలుష్యకారక వ్యర్థాలు, జలాలు, వాటి నిర్వహణపై పూర్తిస్థాయి ఆడిట్ చేపట్టి నివేదిక ఇవ్వండి. ఇప్పటివరకు తీసుకున్న చర్యలు ఏమిటి..? భవిష్యత్తులో చేయబోయే పనుల మీద స్పష్టమైన ప్రణాళికను సిద్ధం చేయండి' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర ఉన్నత అధికారులు, తూర్పు గోదావరి జిల్లా అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను 'కాలుష్యరహిత గోదావరి' థీమ్ తో సాకారం చేసి నిర్వహించడానికి కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం 6 గం.కు పవన్ కళ్యాణ్ రాజమహేంద్రవరం పుష్కరాల ఘాట్ నుంచి కోటిలింగాలు ఘాట్ వరకు పడవలో ప్రయాణించి గోదావరి జలాల కాలుష్యకారక ప్రాంతాలని పరిశీలించారు. పుష్కరాల్లో చేయాల్సిన పనుల తీరు, త్వరలో చేపట్టబోయే పనుల ప్రణాళికను స్వయంగా పరిశీలించారు. గోదావరి గట్ల సుందరీకరణ పనులు ఎంతవరకు వచ్చాయనేది, పుష్కరాల నేపథ్యంలో గట్లను ఎలా తీర్చిదిద్దబోతున్నది అధికారులు వివరించారు. ఈ సందర్భంగా చింతలమ్మ ఘాట్ వద్ద నల్లా ఛానల్ ద్వారా రాజమహేంద్రవరం మురుగునీరు గోదావరిలోకి కలిసే ప్రాంతాన్ని పవన్ కళ్యాణ్ స్వయంగా పరిశీలించారు. నది తీరంలో జరుగుతున్న కాలుష్యం తీరును స్వయంగా చూశారు. నీటిని ఎలా శుద్ధి చేస్తున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న సిబ్బందితో మాట్లాడి వ్యర్థాలను వేరు చేసే విధానాన్ని చూశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ అధికారులకు ఆదేశాలిస్తూ "గోదావరిలోకి రోజువారీ సుమారుగా 55 ఎం. ఎల్. డి. (మిలియన్ లీటర్స్ పర్ డే) మురుగునీరు వస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఈ మురుగు నీటిని శుద్ధి చేసే విధానం శాస్త్రీయంగా జరగాలి.

# రాష్ట్రపతి చేతుల పద్మశ్రీలు అందచేత

**విజయవాడ మే 25** :(వార్తా ప్రభ ప్రతినిధి) రాష్ట్రపతి భవన్‌లో సోమవారం జరిగిన పద్మ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రొఫెసర్ వెంపటి కుటుంబ శాస్త్రి (సాహిత్యం ఉ విద్య విభాగం), శ్రీ గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ (మరణానంతరం) (కళల విభాగం)లకు పద్మశ్రీ పురస్కారాలు ప్రదానం చేశారు. గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ తరఫున ఆయన కుమారుడు గరిమెళ్ళ అనిల్ కుమార్ ఈ పురస్కారాన్ని రాష్ట్రపతి చేతుల మీదుగా స్వీకరించారు.



ప్రొ. వెంపటి కుటుంబ శాస్త్రి



గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్

# దేశానికి ఆదర్శం మన మహిళలు

● ఒకేరోజు 8 వేల ఇందిరా స్త్రీ శక్తి భవనాల నిర్మాణం ● త్వరలోనే ఇందిరా మహిళా శక్తి కార్పొరేట్ సూపర్ బజార్లు, లాజిస్టిక్ హబ్లు, గోదాములు, రైస్ మిల్లులు ● సచివాలయం నుంచి వర్చువల్ గా శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ మే 25** :(వార్తా ప్రభ ప్రతినిధి)2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మహిళా శక్తిని దేశానికి ఆదర్శంగా నిలబెట్టడమే ప్రజా ప్రభుత్వ సంకల్పమని అన్నారు. 'మహిళలు ఆర్థికంగా నిలబడితే కుటుంబం నిలబడుతుంది, కుటుంబం నిలబడితే గ్రామం బలపడుతుంది, గ్రామం బలపడితే తెలంగాణ అభివృద్ధి చెందుతుంది..' అన్నారు. మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ రుణాల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇప్పటివరకు ప్రజా ప్రభుత్వం మహిళా సంఘాలకు రూ.60,472 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు అందించిందని, వడ్డీ లేని రుణాలకు ఇప్పటికే రూ.1,390 కోట్లను చెల్లించిందన్నారు. మహిళా సంఘాలు ఇకపై చిన్నచిన్న ఉపాధి కార్యక్రమాలకే పరిమితం కాకుండా పెద్ద వ్యాపారాల్లోకి రావాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. రైస్ మిల్లులు, మండల స్థాయిలో గోదాములు, లాజిస్టిక్ పార్కులు నిర్మించుకోవాలని సూచించారు. వాటికి అవసరమైన చోట భూములను కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. అవసరమైతే 100 ఎకరాల వరకు భూములు ఇవ్వడానికి సిద్ధమని అన్నారు. ధాన్యం కొనుగోలు, నిల్వ, మిల్లింగ్ వ్యవస్థలో మహిళా సంఘాల పాత్ర పెరగాలని సీఎం అన్నారు. సంఘాలే వడ్లు కొనుగోలు చేసి, బియ్యం ప్రభుత్వానికి అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆడబిడ్డలు ప్రతి గింజకు జవాబుదారులుగా ఉంటారని, వారి చేతుల్లోకి ఈ వ్యవస్థ వెళ్తే పారదర్శకత, బాధ్యత మరింత పెరుగుతుందన్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో కార్పొరేట్ తరహాలో మహిళా శక్తి సూపర్ బజార్లు నెలకొల్పాలని ముఖ్యమంత్రి సూచించారు. డీమార్ట్, బిగ్‌బజార్‌లకు పోటీగా ఉండేలా అద్భుతమైన మహిళా శక్తి సూపర్ బజార్లు ఏర్పాటు చేయాలని అన్నారు. పట్టణాల్లో సూపర్ బజార్ల ఏర్పాటుకు తక్కువ ధరకు స్థలాలను లీజుకు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. నాణ్యమైన వస్తువులు ప్రజలకు అందుబాటులోకి రావాలి, రైతుల ఉత్పత్తులకు మార్కెట్ దొరకాలి, మహిళా సంఘాలకు ఆదాయం రావాలి అన్నదే ఈ ఆలోచన వెనుక ఉన్న లక్ష్యమని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా మహిళా శక్తి సూపర్ బజార్లలో వాటాదారుగా ఉంటుందని, రైతులు పండించే మంచి పంటలు, ఆర్గానిక్ ఉత్పత్తులు, నిత్యావసర సరుకులు వీటి ద్వారా వినియోగదారులకు చేరేలా చూడాలని అన్నారు. గ్రామీణ ఉత్పత్తులకు మంచి మార్కెట్ లభిస్తే రైతులకు మేలు జరుగుతుందని, వినియోగదారునికీ నాణ్యమైన వస్తువు, మహిళా సంఘాలకూ ఆదాయం లభిస్తుందని చెప్పారు.సోమవారం సచివాలయం వేదికగా రాష్ట్రంలో నిర్మిస్తున్న 8 వేల ఇందిరా గాంధీ స్త్రీ శక్తి భవనాల నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. మహిళలను ఆర్థికంగా నిలబెట్టే దిశగా ఇది చారిత్రక కార్యక్రమమని సీఎం అన్నారు. అదే వేదికపై చిలకపచ్చ రంగులో ఉన్న ఇందిరమ్మ చీరల నాలుగు కొత్త డిజైన్లను కూడా సీఎం ఆవిష్కరించారు. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్య సభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణు గోపాల్, మహిళా కమిషన్ ఛైర్మన్ గద్వాల్ విజయ లక్ష్మి, ఎంఎల్ ఏలు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, ఆయా విభాగాల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.


## పాస్‌పోర్టు పోయినది

ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ టౌన్, అజిత్‌సింగ్‌నగర్, దాబాకొట్ల సెంటర్, డోరు నెం.43-11-2 కాపురస్తురాలు కంకళ్ళపాటి మల్లిఖార్జుననాయుడు గారి కుమార్తె కంకళ్ళపాటి సౌమ్య అను నాపేరిట ది.04-03-2022న విజయవాడలో జారీచేసిన ఒరిజినల్ పాస్‌పోర్టు నెం.వి7701677గా గల పాస్‌పోర్టు మరియు కొన్ని కాగితములు కలిగి ఉన్నటువంటి ఫైల్‌ను మేము ది.22-05-2026లో అజిత్‌సింగ్‌నగర్‌లో ఇల్లు మారే సందర్భములో జారివడిపోయినది. పాసుపోర్టు కలిగిన ఫైల్‌ను వరిసర ప్రాంతములో ఎక్కడ వెదకిననూ కనిపించలేదు. సదరు పాన్‌పోర్టును ఉవయోగించి, ఎవ్వరైనా ఎటువంటి అన్యాక్రాంతములు జరిపిన యెడల చట్టప్రకారం తీసుకునే యావత్తు చర్యలకు బాధ్యులు కాగలరని తెలియజేయుచూ, ఎవరికైనా ఒరిజినల్ పాసుపోర్టు దొరికినయెడల నాకు తెలియ వరచినచో తగిన పారితోషకం ఇవ్వబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సెల్ నెం. 9640525259

## పాస్‌పోర్టు పోయినది

ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ టౌన్, వించిపేట, కొప్పులవారి వీధి, డోరు నెం.8-13-17 కాపురస్తుడు (లేటు) షేక్ బాజీద్ గారి కుమారుడు షేక్ అబ్దుల్ ఖాదర్ బాషా అను నాపేరిట ది.09-09-1999న హైదరాబాద్‌లో జారీచేసిన ఒరిజినల్ పాస్‌పోర్టు నెం.బి0577176గా గల పాస్‌పోర్టు మరియు కొన్ని కాగితములు కలిగి ఉన్నటువంటి ఫైల్‌ను మేము ది.16-02-2025లో వించిపేటలో ఇల్లు మారే సందర్భములో జారివడిపోయినది. పాసుపోర్టు కలిగిన ఫైల్‌ను వరిసర ప్రాంతములో ఎక్కడ వెదకిననూ కనిపించలేదు. సదరు పాన్‌పోర్టును ఉవయోగించి, ఎవ్వరైనా ఎటువంటి అన్యాక్రాంతములు జరిపిన యెడల చట్టప్రకారం తీసుకునే యావత్తు చర్యలకు బాధ్యులు కాగలరని తెలియజేయుచూ, ఎవరికైనా ఒరిజినల్ పాసుపోర్టు దొరికినయెడల నాకు తెలియ వరచినచో తగిన పారితోషకం ఇవ్వబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సెల్ నెం. 9908871921

## దస్తావేజు పోయినది

ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ, దుర్గాపురం, 1వ లైన్, సుందర్‌నగర్ కాలనీ, డోరు నెం.24-28-4 కాపురస్తురాలు యిట్టేల సాంబశివరావు గారి భార్య యిట్టేల జయభారతి అనే నేను నా పేరిట విజయవాడ జిల్లా రిజిస్ట్రారు ఆఫీసులో నెం.4651/2000 గా రిజిష్టరు కాబడిన దస్తావేజు మరికొన్ని కాగితములు కలిగిన కవర్‌ను ది.18-05-2026న విజయవాడ వన్‌టౌన్‌లోని వస్త్రలతకు బండిపై వెళుతుండగా మార్గమధ్యలో జారిపడిపోయినవి. వెంటనే చుట్టుప్రక్కల ఎక్కడ వెదకిననూ ఒరిజినల్ ఇంటి కాగితములు కనపడలేదు. కావున ఎవరికైనా దస్తావేజు కనపడిన యెడల నాకు తెలియపరచినచో తగిన పారితోషికం అందజేయబడును. వాటిని ఎవ్వరైనా దుర్వినియోగపరచినచో చట్టప్రకారం చర్యలు తీసుకొందునని, సదరు దస్తావేజును ఎవరికినీ తాకట్టు పెట్టుటగానీ, అన్యాక్రాంతములు చేయుటగానీ జరిగి యుండలేదని యిందుమూలముగా తెలియజేయుచున్నాను.

సెల్ నెం.8374848869

## CHANGE OF NAME

Nadakuditi Adilakshmi W/O. Nadakuditi Adinarayana, Do No 9-A152, Thufan Center, Orlagonditippa, Nidamarru post, Kruthivennu mandalam, Krishna District, Andhra Pradesh. I have changed my name from Nadakuduti Adilakshmi (Old name) To Nadakuditi Adilakshmi (New name) hence forth I am being called Nadakuditi Adilakshmi W/O. Nadakuditi Adinarayana. For all purposes.

# ప్రభుత్వ ఆసుపత్రిలో మేయర్ ఆకస్మిక తనిఖీ!!

- వడ దెబ్బ బాధితులకు తక్షణ వైద్యం అందించాలి
- వైద్యుల గైర్హాజరుపై ఆగ్రహం
- పేదలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం
- మౌలిక సదుపాయాల కొరత - ఫిర్యాదులు



**పెద్దపల్లి/ మే 25 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండం మేయర్ మహంకాళి స్వామి వడ దెబ్బ బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని కోరుతూ సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ఎండల తీవ్రతతో మరణాలు సంభవిస్తున్న నేపథ్యంలో వార్డులను పరిశీలించి, వైద్యుల గైర్హాజరు, ఫ్యాన్లు, కూలర్లు పని చేయకపోవడంపై రోగుల ఫిర్యాదులను స్వీకరించారు. కొత్తగా 10 కూలర్లు, 20 ఫ్యాన్లు, ఎంఆర్ఐ స్కానింగ్ అవసరమని వైద్యులు కోరగా, సమస్యలను ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని మేయర్ హామీ ఇచ్చారు. ఆసుపత్రిలో అత్యవసరంగా టవర్ ఏసీలు ఏర్పాటు చేయాలని, అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వైద్యులు ఫోన్ కాల్స్‌కు స్పందిస్తూ, ప్రైవేట్ ప్రాక్టీస్ కంటే పేదల వైద్యంపై దృష్టి సారించాలని హెచ్చరించారు. ఆసుపత్రిలో నీటి సమస్య రాకుండా చూడాలని, అంబులెన్స్ సేవలు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ డా.రాజు, వైద్యులు అశోక్, అజయ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## వడదెబ్బకు గురి కాకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు పాటించాలి.

### సీఐ కిషోర్ బాబు

### జి.కొండూరు పోలీస్ స్టేషన్ లో మజ్జిగ పంపిణీ ప్రక్రియ ను ప్రారంభించిన సీఐ



**జి.కొండూరు:మే 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**వడదెబ్బకు గురి కాకుండా ఉండేందుకు ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాల ని మైలవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.కిషోర్ బాబు పేర్కొన్నారు.జి.కొండూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ కె. సతీష్ కుమార్,ఉమెన్ ఎస్ఐ గిరిజమణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని సీఐ కిషోర్ బాబు సోమవారం ప్రారంభించారు.ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు సూచన మేరకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ ఇటీవల పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా, జి.కొండూరు పోలీస్ స్టేషన్ లో సిబ్బంది మరియు ఫిర్యాదుదారుల కొరకు మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వెల్లడించారు.ప్రజలు మధ్యాహ్నం సమయంలో సాధ్యమైనంత వరకు బయటకు రావద్దని సూచించారు.తగినంత మంచినీరు తీసుకోవా లని, మద్యం తాగి ఎండలో తిరగడం, వాహనాలు నడపడం వంటి పనుల ద్వారా వడదెబ్బకు గురై నష్టం జరిగే అవకాశం ఉందని అన్నారు.సిబ్బందికి మరియు స్టేషన్ కి వచ్చే ఫిర్యాదుదారులకు మజ్జిగ అందుబాటులో ఉంచినందుకు జి.కొండూరు ఎస్సై కె.సతీష్ కుమార్, ఎస్సై-2 గిరిజామణి స్టేషన్ సిబ్బందిని సర్కిల్ ఇన్స్పెక్టర్ అభినందించారు.

## గుడివాడ మహిళా వాకర్స్ ఆధ్వర్యంలోవిద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ..



**గుడివాడ :మే 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ది గుడివాడ మహిళా వాకర్స్ అసోసియేషన్ వారీ అధ్యర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో విద్యార్థులకు బుక్స్ డిప్యూటీ గవర్నర్ వీ దీవెన పంపిణీ చేసినారు ఈ కార్యక్రమం లో ది గుడివాడ మహిళా వాకర్స్ అసోసియేషన్ సెక్రటరీ యమ్ ప్రతిమ ట్రెజరర్ ఎం కృష్ణకుమారి జిల్లా ట్రెజరర్ ఎన్టీఆర్ స్టేడియం సంయుక్త కార్యదర్శి కె రంగ ప్రసాద్ అలాగే ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ అధ్యక్షులు మరియు దివ్య వాకర్స్ క్లబ్ ట్రెజరర్ ఎస్ విజయశాంతి పూలే వాకర్స్ క్లబ్ అధ్యకురాలు డి నాగరాణి తెలుగు మహిళా వాకర్స్ క్లబ్ ట్రెజరర్ శైలజ తదితరులు పాల్గొని జయప్రదం చేశారు.

## ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు



**గుడివాడ :మే 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు కూడా అవసరమని గర్ల్స్ హై స్కూల్ రిటైర్డ్ హెచ్ఎం డి. శ్యామ్ అన్నారు శాఖ గ్రంథాలయం రాజేంద్ర నగర్ నందు సమ్మర్ క్యాంప్ లో భాగంగా విద్యార్థులకు పేపర్ టాయ్స్ చేయించడం నేర్పించారు అలాగే ఆటవిడుపుగా పలు రకాల పోటీలను నిర్వహించారు ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు గ్రంథాలయ సిబ్బంది పి శాంతి పాఠకులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షునిచే ఉచిత మజ్జిగ పంపిణీ

### పాల్గొన్న గెజిటెడ్ అధికారులు



**విస్సన్నపేట మే 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఎన్టీఆర్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు తిరువూరు ఏఎంసి వైస్ చైర్మన్ వైభవ్ జ్యూయలరీ అధినేత కుక్కడపు వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 200 లీటర్ల మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిన్న రాట్నాలు మాట్లాడుతూ కూలింగ్ మినరల్ వాటర్ తో జిలకర ఉప్పు తదితరాల పెరుగు మిశ్రమమును మండు వేసవి సమయంలో తీవ్ర ఉష్ణోగ్రతల మధ్య ప్రజలకు అందించటం మంచి ఉపశమనం కల్పించడమే అని అన్నారు. ఎస్ ఐ అర్జునరాజు మాట్లాడుతూ మజ్జిగలో ఔషధ గుణాలు ఉన్నాయని వేసవికాలంలో దాహాన్ని తీర్చే చక్కని పానీయమని కరివేపాకు అల్లం, పచ్చిమిర్చి మిశ్రమంతో నానిన మజ్జిగ సేవించడం వలన వేడిగాలులలో పయనించే వారికి కూడా కొంత బడలిక తగ్గుతుంది అన్నారు. మజ్జిగ తాగటం వలన రక్త సరఫరా మెరుగుపడుతుందని జీర్ణ సంబంధిత సమస్యలు తెరమరుగు అవుతాయని ముఖ్యంగా గ్యాస్ అసిడిటీ తగ్గుతోందని అలాగే చర్మం కాంతివంతమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాన్ బోకర్స్ అసోసియేషన్ కార్యదర్శి నాగు బండి గిరిబాబు, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అనుమోలు శివ బాజీ, సహకార సంఘ అధ్యక్షులు కే బద్రీనాథ్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సంతూరు బాలు, వాసవి క్లబ్ జిల్లా నాయకులు చక్రవర్తి, బిజెపి సీనియర్ నాయకులు కే శ్రీను, పెనుగొండ సత్యనారాయణ, నాగు బండి రాఘవేంద్రకృష్ణ, బిజెపి మండల అధ్యక్షుడు జి మధు బాబు, కుక్కడపు రాము, అత్తులూరి సురేష్,శ్రీరాంపురం ఆర్యవైశ్య ప్రముఖులు మధు తదితరులు మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం నూతనంగా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కె.వి నాగేశ్వరరావుకు ఆర్యవైశ్య సామాజిక పెద్దలు ఘన సన్మానం నిర్వహించారు.

# అన్న క్యాంటీన్లలో ఆరోగ్యకరమైన వాతావరణం కల్పిస్తున్నాం

### విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ పశ్చిమ మే 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరంలోని అన్న క్యాంటీన్లలో ప్రజలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. సోమవారం ఉదయం తన నగర పర్యటనలో భాగంగా బందర్ రోడ్, సూర్యారావుపేట, వన్‌టౌన్ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి పారిశుధ్య నిర్వహణ, శుభ్రత పనులు, ప్రజలకు అందుతున్న సౌకర్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా వన్‌టౌన్‌లోని గాంధీజీ మహిళా కళాశాల సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను కమిషనర్ పరిశీలించారు. క్యాంటీన్ పరిసర ప్రాంతాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఆహారం తీసుకునే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. అలాగే క్యాంటీన్ పరిసరాల్లో చెత్త పేరుకుపోకుండా తరచూ అధికారులు పర్యవేక్షిస్తుండాలని ఆదేశించారు.ప్రజలు అధిక సంఖ్యలో వచ్చే అన్న క్యాంటీన్లలో తాగునీరు, పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కమిషనర్ తెలిపారు. నగర ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా విజయవాడ నగరపాలక సంస్థ నిరంతరం కృషి చేస్తోందన్నారు.తదుపరి అంబేద్కర్ స్మృతి వెనుక భాగంలో ఉన్న అంబేద్కర్ కళావేదిక ప్రాంగణాన్ని కమిషనర్ పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను సమీక్షించి, ప్రాంగణం పూర్తిగా పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు గౌరవనీయులైన నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరగనున్న నేపథ్యంలో కళావేదిక పరిసర ప్రాంతాల్లో ఎటువంటి లోపాలు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

# జంతు పరిరక్షణ నోడల్ అధికారిగా ఏ డి సి పి గుణ్ణం రామకృష్ణ నియామకం



**విజయవాడ పశ్చిమ మే 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**బక్రీద్ సందర్భంగా జంతు పరిరక్షణ చట్టాల అమలు కోసం నోడల్ అధికారిగా ఏ డి సి పి గుణ్ణం రామకృష్ణ ని నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు నియమించారు.ఎన్.టి.ఆర్.పోలీస్ కమీషనరేట్ వ్యాప్తంగా జాయింట్ యాక్షన్ బృందాలతో తనిఖీలు నిర్వహించనున్నాయి.రాష్ట్రంలో బక్రీద్ సందర్భంగా జంతువుల అక్రమ రవాణా మరియు వధ మొదలగు నేరాలను అరికట్టాలనే ఉద్దేశంతో జంతు పరిరక్షణ చట్టాలను అమలుపరిచే దిశగా ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ వారి ఆదేశాల మేరకు ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ తరుపున ఒక ఎ.డి.సి.పి.స్థాయి అధికారిని నోడల్ అధికారిగా నియమించడం జరిగింది. నగరంలో ఎక్కడైనా జంతువులపై జరుగుతున్న నేరాలు, హింసపై ఈ క్రింది తెలిపిన నోడల్ అధికారి కి సమాచారం ఇవ్వగలరని సీ పి తెలిపారు. ప్రజలు 9490493192. నెంబర్ కి ఫోన్ చేసి సమాచారం అందిస్తే ప్రత్యేక బృందాలు రంగంలో దిగుతాయి.దీనివలన నగరంలో జంతువులపై జరుగు హింసను అరికట్టవచ్చు, జంతువులను హింసించిన వారిపై గో సంరక్షణ చట్టం-1960 క్రింద చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుంది. బక్రీద్ నేపధ్యంలో జంతువుల అక్రమ రవాణా మరియు వధ మొదలగు నేరాలను నివారించడానికి ఎన్.టి.ఆర్.పోలీస్ కమీషనరేట్ వ్యాప్తంగా ముఖ్యమైన కూడళ్ళలో జాయింట్ యాక్షన్ బృందాల ద్వారా పలు చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేయడంతో పాటు అన్ని ప్రదేశాలలో తనిఖీలను నిర్వహించడం జరుగుతుందని పోలీసులు హెచ్చరించారు.

# ప్రజల సమస్యలపై శాఖాధిపతులు ప్రత్యేక దృష్టి పెట్టాలి

### విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ పశ్చిమ మే 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రజల నుండి వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, క్షేత్రస్థాయిలో పరిశీలించి శాశ్వత పరిష్కారం అందించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కమిషనర్ పాల్గొని ప్రజల వినతులను స్వీకరించారు. ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన కమిషనర్, గతంలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కార స్థితిని శాఖాధిపతులతో చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని సూచించారు.మున్సిపల్ సేవల కోసం రూపొందించిన "పురమిత్ర" యాప్‌లో నమోదవుతున్న ఫిర్యాదులను కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను ఒక శాఖ నుండి మరో శాఖకు మళ్లించడం కాకుండా, సంబంధిత అధికారులు స్వయంగా స్పందించి సమస్యలకు పరిష్కారం చూపాలని కమిషనర్ స్పష్టం చేశారు. శాఖలన్నీ పరస్పర సమన్వయంతో పని చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పేర్కొన్నారు.ఈ సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మొత్తం 13 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. వీటిలో పట్టణ ప్రణాళిక శాఖకు సంబంధించిన అక్రమ నిర్మాణాలు 6, రోడ్ల ఆక్రమణలు వంటి అంశాలపై ఎక్కువ ఫిర్యాదులు నమోదు కాగా, రెవెన్యూ 3, ఇంజనీరింగ్ 2, ప్రజారోగ్య శాఖలకు సంబంధించిన 2 పలు సమస్యలను కూడా ప్రజలు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి ఫిర్యాదును అధికారులు స్వయంగా పరిశీలించి, ప్రజలకు స్పష్టమైన మరియు శాశ్వత పరిష్కారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పారదర్శకంగా, సమర్థవంతంగా పనిచేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డాక్టర్ డి. చంద్రశేఖర్, ఏ. రవీంద్రరావు, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, చీఫ్ ఇంజనీర్ (ఇంచార్జ్) సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సృజన, పర్యవేక్షణ ఇంజనీర్ (వర్క్స్) చంద్రశేఖర్, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, అకౌంట్స్ ఆఫీసర్ బి. సత్యనారాయణమూర్తి, ఎస్టేట్ ఆఫీసర్ ఏ. శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు గోపాలకృష్ణ, ప్రభాకర్, రీజినల్ ఫైర్ ఆఫీసర్ సి హెచ్ రత్న బాబు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ డి. హరీష్, బయాలజిస్ట్ ఏజే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి అర్జీపైనా ప్రత్యేక దృష్టిపెట్టండి..

### అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యను పరిష్కరించండి

### జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ



**విజయవాడ మే 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రతిష్టాత్మక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందుతున్న ప్రతి అర్జీపైనా ప్రత్యేక దృష్టిపెట్టాలని.. అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యను పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అన్నారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం-పీజీఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ.. డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహంతో కలిసి అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మొత్తం 124 అర్జీలు అందగా.. వీటిలో పోలీస్ 24, రెవెన్యూ 23, ఎంఏయూడీకి 14, పంచాయతీరాజ్11, సాంఘిక సంక్షేమం 9, విద్య 8, పౌర సరఫరాలు 6, డీఆర్డీఏ 5, ఉపాధికల్పన 4, ఏపీ సీపీడీసీఎల్ 3, హెల్త్ 2, గ్రామీణ నీటి సరఫరా 2, విభిన్న ప్రతిభావంతులు 2, సహకార 2, కార్మిక 2, హౌసింగ్,రోడ్లు మరియు భవనాలు, పంచాయతీరాజ్ ఇంజనీర్, అటవీ, వక్ఫ్ బోర్డు, ప్రజా రవాణా, దేవదాయ శాఖలకు సంబంధించి ఒక్కో అర్జీ స్వీకరించినట్లు జేసీ తెలిపారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఇలక్కియ మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన ప్రతీ ఆర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాల్సిందేనన్నారు. నిబంధనలను పాటిస్తూ ఆర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. .

# గోవధ కు పాల్పడకండి. -సిఐ కె.కిషోర్ బాబు

### జి.కొండూరు పోలీస్ స్టేషన్ లో ముస్లిం పెద్దలు, ఇమామ్‌లతో సమావేశమైన సీఐ



**జి.కొండూరు, మే 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**గోవధ కు పాల్పడవద్దని,నిబంధన లకు లోబడి అనుమతించబడిన ప్రదేశాలలో మాత్రమే పశు వధ చేపట్టాలని మైలవరం సర్కిల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.కిషోర్ బాబు వెల్లడించారు.జి.కొండూరు పోలీస్ స్టేషన్ లో స్థానిక ఎస్ఐ కె. సతీష్ కుమార్,ఉమెన్ సబ్ ఇన్స్పెక్టర్ ఆర్. గిరిజమణి ఆధ్వర్యంలో రాబోయే బక్రీద్ పండుగ నేపథ్యంలో, పశు వధకు సంబంధించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతి భద్రతలను పరిరక్షించే క్రమంలో మండలంలోని ముస్లిం పెద్దలు, ఇమామ్‌లు, మటన్ షాప్ యజమానులతో సోమవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశానికి సీఐ కిషోర్ బాబు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన ముస్లిం పెద్దలు, ఇమామ్‌లు, మటన్ షాప్ యజమానులకు కొన్ని సూచనలు,సలహాలు ఇచ్చారు.చట్టప్రకారం నిషేధించబడిన గోవధ (ఆవు వధ) వంటి చర్యలకు పాల్పడరాదని వారికి సూచించారు.ఎటువంటి పుకార్లను నమ్మవద్దని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని సీఐ కోరారు.మతసామరస్యాన్ని కాపాడుతూ, అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## 10వ తరగతి లో ప్రతిభ కనబరిచిన ఉమ్మడి కృష్ణాజిల్లా యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



**విజయవాడ, మే 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆంధ్ర ప్రదేశ్ సచివాలయ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, జలవనరుల శాఖ అసిస్టెంట్ సెక్రటరీ యాదవ పెద్దలు డా: బత్తుల అప్పారావు యాదవ్ అధ్యక్షతన యాదవ సంగీత ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ డా: తుపాకుల మోహనరావు యాదవ్, నారాయణ కళాశాల ఐ ఐ టి ఫ్యాకల్టీ బొడ్డు దుర్గారావు యాదవ్, సి సి ఎల్ ఏ సూపరింటెండ్ జిడ్డు శ్రీనివాస్ యాదవ్, ప్రభుత్వ ఉపాధ్యాయులు మాగంటి శ్రీనివాసరావు యాదవ్, గొరిపర్తి ఏడుకొండలు యాదవ్, విదేశీ కన్సల్టెన్సీ నీలపాల కృష్ణారావు యాదవ్, సీనియర్ జర్నలిస్టు గొరిపర్తి సాంబశివ రావు యాదవ్, న్యాయవాది తాడిబోయిన మురళీ కృష్ణ యాదవ్, డిల్లీ ఏడుకొండలు,అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పెద్దిబోయిన శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా "వార్తా ప్రభ" తో యాదవ నాయకులు పెద్దిబోయిన శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ పేద యాదవ విద్యార్థులకు అండగా ఉంటూ, మెరిట్ యాదవ విద్యార్థులను ప్రోత్సహించేందుకు యాదవ పెద్దలు, విద్యావంతుల ఆధ్వర్యంలో త్వరలో కార్యక్రమం తీసుకురానున్నట్లు తెలిపారు.

# దర్శకరత్న దాసరి మిత్రుడుకి 25వేలు ఆర్థిక సహాయం.



**విజయవాడ పశ్చిమ మే25(వార్తా ప్రభ ప్రతినిధి)**తెలుగు సినీ దర్శకరత్న దాసరి నారాయణరావుకి మిత్రులు బుద్దావెంకన్న,శనగశెట్టి సుబ్బారావులు.వారిలో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని బావజీపేటలోని దర్శకరత్న దాసరి నారాయణరావుకి మిత్రులు, రాధా రంగా మిత్ర మండలి సభ్యుడుశనగశెట్టి సుబ్బారావు(కండక్టర్ సుబ్బారావు) తన ఆర్థిక పరిస్థితి నిమిత్తం బుద్దా వెంకన్న మిత్ర బృందం ఆధ్వర్యంలో 25వేలు రూపాయిల నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు.శనగశెట్టి సుబ్బారావు నివాసం ఉంటున్న ఇంటికి బుద్దా వెంకన్న మిత్ర బృందం కళ్ళే నాగేశ్వరరావు,రాజనాల మాణిక్యాలరావు,కొప్పుల వెంకట్, చందన సురేష్(మామ),యాసం చిట్టిబాబులు సోమవారం వెళ్లి అతని యోగ క్షేమలు అడిగి తెలుసుకుని ఇరవై ఐదు వేల రూపాయల నగదును అందజేశారు.నరాలకు సంబంధించిన వ్యాధి ద్వారా పక్షవాతం వచ్చి మంచంపై ఉన్న సుబ్బారావు యొక్క ఆర్థిక స్థితికి విని చలించిన బుద్దా వెంకన్న తన మిత్ర బృందంతోఇరవై ఐదువేల రూపాయల నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు.

# ఆవు కు అంత్యక్రియలు

### మానవత్వం చాటుకున్న జర్నలిస్ట్ నాగరాజు



**ఇబ్రహీంపట్నం,మే 25 (వార్తా ప్రభ ప్రతినిధి):** మృతి చెందిన ఆవుకు అంత్యక్రియలు చేసి మానవత్వం చాటుకున్నారు ఇబ్రహీంపట్నం కు చెందిన జర్నలిస్ట్ నాగరాజు. లభించిన వివరాల మేరకుఇబ్రహీం పట్నం ఖాజీమాన్యంలో ఆవు రోడ్డుపై కొన ఊపిరితో పడి ఉండడాన్ని గమనించిన రిపోర్టర్ నాగరాజు దానికి సపర్యాలు చేశారు. దాని ప్రాణాలు కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. తీవ్ర అస్వస్థతతో ఉన్న ఆ ఆవు ప్రాణాలు దక్కలేదు. దీంతో తన సహచరులతో కలిసి ఆవుకు అంత్యక్రియలు చేశారు. మానవత్వం చాటుకున్న జర్నలిస్ట్ నాగరాజు పలువురు అభినందించారు.

# అన్ సీజన్లో పంటలు లేని సమయంలో ఎరువుల అమ్మకాలు నిలుపుదల చెయ్యాలి.

**-జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి**



**ఏలూరు, మే 25** :(వార్తా ప్రభ ప్రతినిధి) కైకలూరు మండలం తామరకొల్లు గ్రామంలో సోమవారం శ్రీనివాస ఫెర్టిలైజర్స్ షాపును జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ఆకస్మిక తనిఖీ చేశారు. షాపులో ఉన్న యూరియా డిఏపి, పొటాషియం మరియు కాంప్లెక్స్ ఎరువులు భౌతిక నిల్వలు, ఈపాసు నిల్వలు, అమ్మకాలు వివరాలు, స్టాకు రిజిస్టర్లు, రైతులకు ఇస్తున్న బిల్లులను పరిశీలించి, కొన్ని వివరాలను జిల్లా కలెక్టరు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ అన్ సీజన్లో పంటలు లేని సమయంలో ఎరువులు ముఖ్యంగా యూరియా, డిఏపి అమ్మకాలు నిలుపుదల చెయ్యాలని ఆదేశించారు. సదరు షాపులో నిలుపుదల చేసిన వివరాలు కూడా పరిశీలించి, ప్రభుత్వ నిబంధనల మేరకు పంటకు అనుగుణంగా ఎరువుల విక్రయాలు చేపట్టాలని సూచించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్నందున రైతులకు సరైన సమయంలో అనుగుణంగా అవసరం మేరకు ఎరువులు అందుబాటులో ఉంచాలని రిటైల్ డీలర్లు మరియు సహకార సంఘాలు ద్వారా యూరియా, డిఏపి మరియు ఇతర ఎరువులు నిల్వలు ఉంచాలని తెలిపారు. రైతులకు అందాల్సిన ఎరువులు అక్రమంగా వ్యవసాయ యేతర అవసరాలకు వినియోగించడం బ్లాక్ మార్కెటు, అక్రమ నిల్వలు పారిశ్రామిక అవసరాలకు వినియోగించిన అటువంటి డీలర్లపై ఎరువులు చట్టం ప్రకారం కఠిన చర్యలు, క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలియజేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం ఎరువులు అందుబాటులో ఉంచుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ జెడి యస్.కె.హబీబ్ భాషా, ఇంచార్చి ఏడిఏ కె.శ్రీనివాస కుమార్, మండల వ్యవసాయ అధికారి ఆర్.దివ్య, గ్రామ విఏఏలు, మరియు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## చేపల చెరువులో పడి బాలుడు మృతి

**అఖిలేష్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు**

**బాలుడిని బలిగొన్న చేపల చెరువు**



**సంగం మే 25(వార్తా ప్రభ ప్రతినిధి)** సంగం మండలంలోని దువ్వూరు గ్రామంలో ఎస్టీ కాలనీలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఏడాదిన్నర వయస్సు గల అభిలాష్ అనే బాలుడు చేపల చెరువులో పడి మృతి చెందాడు.కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఇంటి వద్ద ఆడుకుంటున్న బాలుడు ప్రమాదవశాత్తు సమీపంలోని చేపల గుంటలో పడిపోయాడు. కొంతసేపటి తర్వాత బాలుడు కనిపించకపోవడంతో తల్లిదండ్రులు



ఆందోళన చెందుతూ గ్రామస్తులతో కలిసి గాలింపు చేపట్టారు.ఈ క్రమంలో ఇంటి పక్కనే ఉన్న చేపల చెరువులో బాలుడి మృతదేహం తేలియాడుతూ కనిపించింది. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

## హసనాపురం లో వి.పి.ఆర్ నేత్ర కార్యక్రమం



**అనుమసముద్రంపేట (వార్తాప్రభ ప్రతినిధి)** ఏఎస్ పేట మండలం హసనాపురం గ్రామంలో విపిఆర్ ఫౌండేషన్ ద్వారా వేమిరెడ్డి దంపతులు ఏర్పాటుచేసిన విపిఆర్ నేత్ర కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు ఈ సందర్భంగా మండల టిడిపి కన్వీనర్ రాష్ట్ర ఎడ్యుకేషన్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ వెల్ఫేర్ డెవలప్మెంట్ డైరెక్టర్ అబ్బూరి రమేష్ నాయుడు పాల్గొని ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి చేపట్టిన విపిఆర్ నేత్ర కార్యక్రమాన్ని ఏఎస్ పేట మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు మన ఇంటి ముందుకే వైద్యాన్ని తీసుకువచ్చి ప్రతి ఒక్కరికి కూడా దృష్టి లోపాలు లేకుండా నాణ్యమైన కంటి చూపును అందించాలని విపిఆర్ దంపతులు చేస్తున్న ఈ ప్రయత్నం వారి మంచి మనసులకు నిదర్శనం అన్నారు ఈ వి పీఆర్ నేత్ర కార్యక్రమంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వెంటనే ఉచితంగా కంటి అద్దాలు అందజేయడం జరిగిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హసనాపురం జువ్వలగుంటపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని సిపిఐ డిమాండ్



**రాజాం ,మే 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉల్లా కుల నీలకంతేశ్వర యాదవ్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా డబల్ ఇంజిన్ సర్కారీ చెప్పుకుంటున్నాను ఆంధ్ర ప్రదేశ్ కూటమి ప్రభుత్వంలో డీజిల్ పెట్రోల్ ధరలు ఎక్కువగా ఉండటం దురదృష్టకరమని అన్నారు పెంచన్న ధరలను తక్షణమే సహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలు ఆగ్రహానికి మూల్యం చెల్లించుకోవలసి ఉంటుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇరాన్ అమెరికా యుద్ధాన్ని బూచిగా చూపి ఇంధన ధరలు పెంచడం దుర్మార్గమైన అన్నారు కేంద్ర ప్రభుత్వం పది రోజుల్లో నాలుగు సార్లు పెట్రోల్ డీజిల్ ధరలు పెంచి సామాన్య మధ్యతరగతి ప్రజలు నడ్డి విరిచిందని అన్నారు. ఈ నెల 15న పెట్రోల్ పై మూడు డీజిల్ పై మూడు రూపాయలు 19న పెట్రోల్ పై 87 డీజిల్ పై 81 పైసా 23న 91 పైసా పెట్రోల్ పై 90 పైసలు డీజిల్ పై 25న పెట్రోలపై రెండు 84 పైసలు డీజిల్ 2 86 పైసలు పెంచడం దుర్మార్గమని అన్నారు.

## కామాక్షి కళ్యాణ మండపంలో మహానాడు సన్నాహక ఏర్పాట్లు





**అనుమసముద్రంపేట (వార్తాప్రభ ప్రతినిధి)** రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాలతో సోమవారం సాయంత్రం చిరమణ ఏఎస్పేట కామాక్షి కళ్యాణ మండపంలో జరిగే తెలుగుదేశం మహానాడు సన్నాహక ఏర్పాట్లను మండల టిడిపి నాయకులు పరిశీలించారు.ఈనెల 27,28 తేదీలలో జరగబోయే వర్చువల్ మహానాడు గురించి క్లస్టర్ ఇంచార్జి యూనిట్ ఇన్చార్జిలు బూత్ కన్వీనర్లు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలతో చర్చించడం జరిగింది చిరమణ క్లస్టర్ ఇంచార్జ్ కె నరసింహారెడ్డి ఏఎస్పేట క్లస్టర్ ఇంచార్జ్ పులిమి సుధాకర్ రెడ్డి లతో కలసి మండల టిడిపి కన్వీనర్ రాష్ట్ర ఎడ్యుకేషన్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ వెల్ఫేర్ డెవలప్మెంట్ డైరెక్టర్ అబ్బూరి రమేష్ నాయుడు చర్చించారు ఆయా గ్రామాల్లోని జరిగే స్థలాలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సభ్యులు నుంచి అమూల్యమైన సలహాలు సూచనలు తీసుకోవడం జరిగింది.తెలుగు దేశ పార్టీ కుటుంబ సభ్యులు మాట్లాడుతూప్రజల నమ్మకమే మా బలం అభివృద్ధే మా లక్ష్యం తెలుగు ప్రజల భవిష్యత్తు కోసం పని చేసే పార్టీ అంటే తెలుగుదేశం పార్టీ అని పేర్కొన్నారు.యువతకు ఉద్యోగాలు రైతుకు గౌరవం మహిళలకు భద్రత ఇదే తమ సంకల్పం అని సంక్షేమం మాత్రమే కాదు సంపద సృష్టించే పాలన అవసరంగా భావిస్తున్నామన్నారు.గ్రామం నుండి గ్లోబల్ స్థాయి వరకు ఆంధ్రప్రదేశ్ను తీసుకెళ్లే దిశగా మన ప్రయాణం సాగుతుందన్నారు.జై తెలుగు తల్లి జై ఆంధ్రప్రదేశ్ అభివృద్ధే మా మంత్రం ప్రజాసేవే మా ధర్మం తెలుగు జాతి గర్వం తెలుగుదేశం విజయం అని మహానాడు గొప్పతనం గురించి కొనియాడారు. మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సూచనలతో ఐక్యతగా వర్చువల్ మహానాడు కార్యక్రమం విజయవంతం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు ఏలూరు మాల్యాద్రి నాయుడు దేవరాల హజరతయ్య పైడి శ్రీనివాసులు షేక్ ఖాదర్ బాషా షేక్ అఫ్జల్ ఖాజామియా తదితరులు పాల్గొన్నారు

# మైలవరంలో గాలివాన బీభత్సం.....!

- బలమైన ఈదురు గాలులకు దెబ్బతిన్న కరెంట్ పోల్స్ ,ట్రాన్స్ఫార్మర్ లు
- తెగిపడిన విద్యుత్ లైన్స్
- విద్యుత్ సరఫరాకు అంతరాయం





**మైలవరం:మే 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సోమవారం సాయంత్రం ఉన్నట్టుండి ఒక్కసారిగా బలమైన ఈదురు గాలులు, అకాల వర్షానికి మైలవరం పట్టణం పరిసర ప్రాంతాలలో కరెంట్ పోల్స్ ,ట్రాన్స్ఫార్మర్ లు దెబ్బతిన్నాయి.గాలివాన బీభత్సానికి విద్యుత్ తీగలు తెగి పడ్డాయని, దీంతో ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంటుకు భారీ నష్టం వాటిల్లిందని విద్యుత్ శాఖ ఏడిఈ ఐ.సుధాకర్ వెల్లడించారు.కరెంట్ పోల్స్ , ట్రాన్స్ఫార్మర్ లు దెబ్బ తినడంతో మైలవరం పట్టణం పరిసర గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మరోవైపు భారీ ఉరుములు, మెరుపులతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురయ్యారు.కొన్ని చోట్ల కొబ్బరి చెట్లు నేలకులాయి,సుమారు 40 నిమిషాల పాటు వర్షం పడటంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.అప్పటివరకు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు వాతావరణం చల్లబడటంతో సేద తీరారు.

## తలసీమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరం

**సిపిఆర్ అవగాహన కార్యక్రమం**



**మల్కాజ్ గిరి, మే 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆనంద్ బాగ్ రెసిడెన్స్ అసోసియేషన్ భవనంలో కామినేని హాస్పిటల్స్ ఎల్బీనగర్, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తలసేమియా చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో కాలనీ వాసులు రక్తదానం చేశారు. కామినేని హాస్పిటల్స్ ఎల్బీనగర్ వారు సీపీఆర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హఠాత్తుగా గుండె కొట్టుకోవడం ఆగిపోతే తీసుకోవాల్సిన తక్షణ చర్యల గురించి వివరించారు. సిపిఆర్ విధానం వల్ల గుండె కొట్టుకోవడం ఆగినా 4నిమిషాల లోపు సిపిఆర్ చేయగలిగితే తిరిగి గుండె కొట్టుకోవడం ప్రారంభించవచ్చని తెలిపారు. అందుకోసం ప్రతి ఒక్కరు ఈ విషయం పై అవగాహన కల్గి ఉంటే ఎంతో మేలు అన్నారు. ఈ కార్యక్రమంలో కామినేని డాక్టర్ పునీత్ అసోసియేట్ ప్రొఫెసర్,డాక్టర్ ఎం ఆకాంక్షిత, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ప్రతినిధులు తలసేమియా కో ఆర్డినేటర్ డాక్టర్ టి సురేందర్, డాక్టర్ సాయి కిరణ్, డాక్టర్ సుమంత్, డాక్టర్ సబితా, డాక్టర్ ప్రేరణా, డాక్టర్ మాధురి, శ్రీవాణి సెక్రెటరీ, టెక్నీషియన్స్ అశోక్, పరమేష్, మహేష్, సిస్టర్ మౌనిక, కాలని సంఘం ప్రతినిధులు పి రామలింగేశ్వర రావు ప్రధాన సలహాదారులు, పి మురలీకృష్ణ, ప్రసిడెంట్, పి రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్, జాయింట్ సెక్రటరీలు సి జయప్రకాశ్, సూర్యకుమారి, కామినేని హాస్పిటల్స్ ఎల్బీనగర్ పిఆర్ఓ యాదగిరి, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాల పిల్లలకు ఆశాజ్యోతి సేవలు ఆదర్శం

**రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు**



**హనుమాన్ జంక్షన్, మే 25(వార్తాప్రభ)**హనుమాన్ జంక్షన్లోని ఆశాజ్యోతి హ్యాండిక్యాప్డ్ వెల్ఫేర్ సొసైటీని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సోమవారం ఉదయం సందర్శించారు.ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు ఆశాజ్యోతి అందిస్తున్న సేవలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆయన కొనియాడారు.ఆశాజ్యోతి ఆశ్రమ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా క్రమబద్ధంగా నిర్వహిస్తున్న తీరు చూసి సంతృప్తి వ్యక్తం చేస్తూ నిర్వాహకులు సెక్రటరీ మరీదు మాధవీలత, వ్యవస్థాపకులు మరీదు వెంకటస్వామి ని అభినందించారు.పిల్లల సంరక్షణలో చూపుతున్న శ్రద్ధ, క్రమశిక్షణ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు.స్పెషల్ నీడ్స్ ఉన్న పిల్లలకు ఆశాజ్యోతి హోమ్ అందిస్తున్న సేవలు, విద్యా సదుపాయాలు,వారి మానసిక--శారీరక అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని పల్లా అన్నారు.సాధారణంగా వైకల్యం ఉన్న పిల్లల బాధ్యతలు చూసుకోవడమే కష్టంగా ఉన్న ఈ రోజుల్లో, మానసిక శారీరక వైకల్యం ఉన్న సుమారు 70 మంది పిల్లలను కంటికి రెప్పలా చూసుకుంటూ ఆశాజ్యోతి నిర్వహణ చేస్తున్న సేవ నిజంగా ప్రశంసనీయం అని అన్నారు. ప్రతి చిన్న అంశంలోనూ పిల్లల భద్రత,ఆరోగ్యం, ఆహారం విషయంలో యాజమాన్యం తీసుకుంటున్న జాగ్రత్తలు గమనించదగ్గవని చెప్పారు.పిల్లల్లో మానసిక పరివర్తన తీసుకురావడం చిన్న విషయం కాదని,ఆ దిశగా నిర్వాహకులు చేస్తున్న కృషి విశేషమని ఆయన అభిప్రాయపడ్డారు.ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు సహనం,ప్రేమ,శ్రద్ధ అవసరం అవుతాయని, ఆశాజ్యోతి సిబ్బంది ఆ బాధ్యతను ఎంతో నిబద్ధతతో నిర్వహిస్తున్నారని అన్నారు.అదే సమయంలోశారీరక ధారుడ్యానికి అవసరమైన వైద్య పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహిస్తూ, వారికి అవసరమైన చికిత్సలు అందించడం, పోషకాహారం కల్పించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని కాపాడుతున్న తీరు అభినందనీయం అని తెలిపారు.పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిస్తూ,వారి సామర్థ్యాలకు తగ్గట్టుగా శిక్షణ ఇచ్చి సమాజంలో భాగస్వామ్యులను చేయాలన్న లక్ష్యంతో యాజమాన్యం పనిచేస్తోందని పల్లా అన్నారు.

## చేజర్ల లో మహా నాడు ఏర్పాట్లు పరిశీలన



**చేజర్ల మే 25 (వార్తాప్రభ)** రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాలతో ఆత్మకూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తాళ్లూరి గిరినాయుడు సూచనతో టిడిపి పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ అన్నలూరు శ్రీనివాసులు నాయుడు మాజీ ఎంపీపీ రావి పెంచల రెడ్డి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొమ్మి రమేష్ నాయుడు చేజర్ల మండల సొసైటీ అధ్యక్షులు భూదళ్ళ వీరాఘవ రెడ్డి టిడిపి మండల పార్టీ అధ్యక్షులు ఎస్.కె సిరాజుద్దీన్ టిడిపి పార్టీ ఎస్సీ సెల్ నాయకులు సోమవరపు హజరత్తయ్య మండల కేంద్రమైన చేజర్లలో మహానాడు ఏర్పాట్ల పనులను సోమవారం పరిశీలించినారు.

## సంగం ఎస్సైగా భోజ్యానాయక్ బాధ్యతలు స్వీకరణ




**సంగం మే 25(వార్తాప్రభ ప్రతినిధి)** సంగం పోలీస్ స్టేషన్ ఎస్సై రాజేష్ బదిలీ కాగా ఆయన స్థానంలో కె భోజ్యా నాయక్ సోమవారం బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు.రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

## ఆక్రమించుకున్న భూమిని స్వాధీన పరచుకోండి.



**తిరువూరు ,మే 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** బైపాస్ రోడ్డులో 178 బై 1 సర్వే నంబర్ల గల భూమిని దాతలు దూపుకుంట్ల సాంబశివరావు దూపుకుంట్ల చంద్రశేఖర రావు దాతలు 12 సెంట్లు భూమిని అప్పటి పంచాయతీ బోర్డు ప్రెసిడెంట్ కంచి రామారావు సమయంలో పంచాయతీకి దానంగా రాసి ఇచ్చినారు. ఆ భూమిని కొంతమంది వ్యక్తులు ఆక్రమించుకొని ఉన్నారని దానిని తక్షణమే నగర పంచాయతీ వారు స్వాధీన పంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ కి సిరికొండ ప్రసాద్ వినతిపత్రం సమర్పించారు .

## కారు ఢీకొని వ్యక్తి మృతి



**సంగం మే 25(వార్తా ప్రభ ప్రతినిధి)** సంగం-కొరిమెర్ల రహదారిలో హోల్టాన్ మలుపు వద్ద సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.బైకును కారు ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి.స్థానికులు తెలిపిన వివరాల మేరకు బైక్పై వెళ్తున్న ఇద్దరిని వెనుక నుంచి వచ్చిన కారు బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు ఒకరు మృతి చెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి పంపించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



# బాచుపల్లిలో ఘనంగా బాక్స్ క్రికెట్ లీగ్: అంతిమ పోరుకు చేరిన ఎనిమిది జట్లు!

**మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు ఆధ్వర్యంలో క్రీడా పోటీలు**

**వచ్చే శని, ఆదివారాల్లో తుది సమరం.. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన కాలనీవాసులు**





**బాచుపల్లి, మే 25, (వార్తాప్రభ) :** బాచుపల్లి క్రాంతి నగర్ కాలనీలో నిర్వహిస్తున్న బాచుపల్లి బాక్స్ క్రికెట్ లీగ్ పోటీల మొదటి విడత ఆటలు అత్యంత ఉత్కంఠభరితంగా ముగిశాయి. డివిజన్ మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు ఆధ్వర్యంలో, జాయ్ అంతర్జాతీయ పాఠశాల, తక్ష దంత వైద్యశాల మరియు ఎన్.ఎస్. విద్యాసంస్థల సౌజన్యంతో ఈ పోటీలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

**లీగ్ దశలో హోరాహోరీ పోరు** ఈ క్రీడా పోటీలలో మొత్తం ముప్పై రెండు జట్లు పాల్గొనగా, వాటిని నాలుగు విభాగాలుగా విభజించారు. శని, ఆదివారాల్లో ప్రతి జట్టుకు రెండు మ్యాచ్‌ల చొప్పున మొత్తం ముప్పై రెండు ఆటలను నిర్వహించారు. బ్యాటింగ్, బౌలింగ్‌లలో అద్భుత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్రతి ఆట ముగిశాక 'ఉత్తమ ఆటగాడు' జ్ఞాపికలను, ప్రత్యేక బహుమతులను అందజేశారు. అలాగే మైదానంలో నిర్దేశించిన స్థానాల్లో ఫోర్లు, సిక్సర్లు కొట్టిన ఆటగాళ్లకు కూడా ప్రత్యేక బహుమతులు ప్రధానం చేశారు.

**అంతిమ పోరుకు (క్వార్టర్ ఫైనల్స్‌కు) చేరిన జట్లు ఇవే:** హోరాహోరీగా సాగిన లీగ్ మ్యాచ్‌ల అనంతరం పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన ఎనిమిది జట్లు తదుపరి దశకు అర్హత సాధించాయి. 1. ఓజీస్ ఎలెవన్ 2. ఆరిక్ బాక్స్ క్రికెట్ క్లబ్ 3. అపెక్స్ ప్రిడేటర్స్ 4. టైటాన్స్ యునైటెడ్ 5. ఎస్.ఈ. నైట్స్ 6. విక్టరీ బాయ్స్ 7. ఎలైట్ స్కార్పియన్స్ 8. రాయల్ బ్లూస్

**వచ్చే వారమే తుది సమరం** తదుపరి దశకు చేరిన ఈ ఎనిమిది జట్ల మధ్య వచ్చే శని, ఆదివారాల్లో క్వార్టర్ ఫైనల్స్, సెమీఫైనల్స్ మరియు ఫైనల్ మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. ఆదివారం సాయంత్రం జరిగే ముగింపు వేడుకల్లో విజేతలకు ఘనంగా బహుమతి ప్రధానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

**ఆకట్టుకున్న వ్యాఖ్యానం:** ఈ క్రీడా పోటీలను తిలకించడానికి కాలనీవాసులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆటగాళ్లను ఉత్సాహపరిచారు. ఈ పోటీల విజయవంత నిర్వహణలో హరితవనం కాలనీ యువజన సంఘం సభ్యులు పవన్, సతీష్, అజయ్, మురళి, మణికంఠ, హర్షిత్, పునీత్ కీలక పాత్ర పోషించారు. అలాగే శ్రీకర్, కిషోర్ తమ అద్భుతమైన ఆట వ్యాఖ్యానంతో మ్యాచ్‌లను మరింత ఆహ్లాదకరంగా, ఆసక్తికరంగా మార్చారు.

**నాగారం డివిజన్ పరిధిలో ని వంతెనను త్వరగా పూర్తి చేయాలని డిప్యూటీ కమిషనర్ వాణి రెడ్డికి వినతిపత్రం**

# సమర్పించిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాసరెడ్డి.




**కీసర, నాగారం, మే 25:(వార్తా ప్రభ)**నాగారం డివిజన్ పరిధి హరితపురి కాలనీ మరియు విజయపురి కాలనీ మధ్యలో ఉన్న కనెక్టివిటీ బ్రిడ్జి గత సంవత్సరం 2025 ఆగస్టు నెలలో వరదలకు కూలడం జరిగింది. దానితో గత తొమ్మిది పది నెలలుగా హరితపురి కాలనీ మరియు విజయపురి కాలనీవాసులు కనెక్టివిటీ దారి లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాసరెడ్డి, యువ నాయకులు కాకుంట్ల జీవన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పర్వత్ రెడ్డి, ఘట్కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాణి రెడ్డి ని కలిసి వంతెన పనులు ఎమర్జెన్సీ పరిగణలోకి తీసుకొని త్వరగా పనులు పూర్తి చేయమని వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అలానే రాంపల్లి డబుల్ బెడ్ రూమ్స్ లో ఉన్న సమస్యలపై కూడా వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాంపల్లి డబుల్ బెడ్ రూమ్ నివాసితులు, తదితరులు పాల్గొనడం జరిగింది.

# యాదవ సోదరుల అభివృద్ధికి అంకిత భావంతో పనిచేస్తా

**యాదవ కార్పొరేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్ హామీ**

**చైర్మన్ రఘునాథ్ ను అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి**



**శేరిలింగంపల్లి,మే 25 (వార్తాప్రభ):** తెలంగాణ రాష్ట్ర యాదవ కో-ఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా రఘునాథ్ యాదవ్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందనలు తెలిపి,యాదవ సమాజ సమగ్ర అభివృద్ధి,సంక్షేమం కోసం భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై పలు సూచనలు చేశారు. యాదవ సోదరుల అభ్యున్నతి కోసం అంకితభావంతో పని చేస్తానని రఘునాథ్ యాదవ్ హామీ ఇచ్చారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# 22వ వార్డు అభివృద్ధికి కౌన్సిలర్ అనిత రఘునాథ్ యాదవ్ కృషి

● త్రాగునీటి సౌకర్యాలు, వీధి లైట్ల మరమ్మతులు ● బొడ్రాయి విగ్రహ భద్రతా పనులకు ప్రజల ప్రశంసలు





**షాద్ నగర్, మే 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు రతన్ కాలనీ, భగత్‌సింగ్ కాలనీలలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కౌన్సిలర్ నడికూడ అనిత రఘునాథ్ యాదవ్ ప్రత్యేకంగా కృషి చేస్తున్నారు. కాలనీల్లో త్రాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపల్ నిధులతో బోర్ల మరమ్మతు పనులు చేపట్టడంతో పాటు, పనిచేయని వీధి లైట్లను రిపేర్ చేయిస్తూ కొత్త వీధి లైట్లను కూడా ఏర్పాటు చేస్తున్నారు.కాలనీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్న కౌన్సిలర్ అనిత రఘునాథ్ యాదవ్‌ను స్థానిక కాలనీవాసులు అభినందిస్తున్నారు.ఇదే సందర్భంగా కేశంపేట్ రోడ్ రైల్వే గేట్ సమీపంలో భగత్‌సింగ్ కాలనీకి వెళ్లే మార్గంలో ఉన్న బొడ్రాయి విగ్రహం భద్రత కోసం గతంలో ఏర్పాటు చేసిన ఇనుప ఆంగ్లేర్లు గుర్తుతెలియని లారీ ఢీకొట్టడంతో దెబ్బతిన్నాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న కౌన్సిలర్ వెంటనే స్పందించి, భక్తుల భావాలను గౌరవిస్తూ బొడ్రాయి విగ్రహ రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఇనుప కంచెను మరమ్మతు చేయిస్తున్నారు.దైవభక్తితో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ ప్రజా సేవలో ముందుండడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు.

# బల్దియాలో బద్దలైన కార్మిక అగ్నిపర్వతం!!

● మున్సిపల్ కమిషనర్ వైఖరిపై కన్నెర్ర ● అధికార పార్టీ ఏజెంట్‌గా కమిషనర్? ● పారిశుధ్య కార్మికులపై వేధింపులు, పని ఒత్తిడిపై జేఏసీ ఆగ్రహం ● 20 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కార్మిక గర్జన ● కలెక్టర్ జోక్యం చేసుకోవాలి, కమిషనర్‌ను పంపించే వరకు ఆందోళనలు ఆపేది లేదని హెచ్చరిక



**పెద్దపల్లి/ గోదావరిఖని: మే 25 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండం గడ్డపై కార్మిక లోకం భగ్గుమంది. మున్సిపల్ కమిషనర్ అరుణ శ్రీ నిరంకుశత్వానికి నిరసనగా నిప్పులు చెరిగింది. పారిశుధ్య కార్మికురాలు మల్లమ్మ మృతి కేవలం ప్రమాదం కాదు.. అది ముమ్మాటికీ కమిషనర్ నిర్లక్ష్యం చేసిన హత్యేనని జేఏసీ గర్జించింది. వడదెబ్బతో కుప్పకూలిన కార్మికురాలిని పట్టించుకోని కనికరం లేని పాలనపై సోమవారం టోకెన్ సమ్మెతో యుద్ధం ప్రకటించారు. నాలుగు గంటల పాటు మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి, అరుణ శ్రీని బర్తరఫ్ చేయాలంటూ నినాదాలతో హోరెత్తించారు. అధికార పార్టీ ఏజెంట్‌గా మారి కార్మికుల రక్తం తాగుతున్నారని, కనీసం మనుషులుగా కూడా చూడటం లేదని మహిళా కార్మికులు కన్నీరు మున్నీరయ్యారు. మంచినీళ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వకుండా, రక్షణ పరికరాలు లేకుండా వెట్టిచాకిరీ చేయిస్తూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ధ్వజమెత్తారు. ఎండదెబ్బతో వరుసగా కార్మికులు చనిపోతున్నా, కమిషనర్ తీరులో మార్పు రాకపోవడంపై కార్మిక సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. మల్లమ్మ మృతదేహం కుళ్ళిపోయే వరకు గుర్తించలేదంటే ఇక్కడ పాలన ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోందని నాయకులు మండిపడ్డారు.మల్లమ్మ కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఇంటికో ఉద్యోగం ఇచ్చే వరకు విశ్రమించేది లేదని హెచ్చరించారు. కలెక్టర్ వెంటనే స్పందించి కమిషనర్‌ను పంపించకపోతే రామగుండం నగరం కార్మిక పోరాటంతో అట్టుడుకుతుందని అల్టిమేటం జారీ చేశారు. సుమారు 300 మంది కార్మికులు ఏకతాటిపై నిలిచి చేసిన ఈ మెరుపు సమ్మె బల్దియా అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది. పని ఒత్తిడితో వేధిస్తే ఊరుకునేది లేదని, కార్మికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే పతనం తప్పదని నేతలు హెచ్చరించారు. ఈ ఆందోళనలో వేల్పుల కుమారస్వామి, నడిపెల్లి మురళీధర్ రావు, మార్కపురి సూర్య, వంటి నేతలు పాల్గొని కమిషనర్ నిరంకుశ పాలనపై విరుచుకుపడ్డారు. న్యాయం జరిగే వరకు పోరాటం ఆపబోమని, అవసరమైతే సమ్మెను ఉధృతం చేస్తామని కార్మిక లోకం తెగేసి చెప్పింది. రామగుండం మున్సిపల్ కార్యాలయం సాక్షిగా సాగిన ఈ ధర్నా కమిషనర్ వైఖరికి నిరసనగా ఒక చారిత్రాత్మక పోరాటంగా నిలిచింది.

# ప్రజలకు మరింత చేరువలో ఆధార్ సేవలు అందుబాటులోకి : మంత్రి కొల్లు రవీంద్ర



**మచిలీపట్నం మే 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మచిలీపట్నంలో డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణతో కలిసి నూతన ఆధార్ సేవా కేంద్రం ప్రారంభించిన మంత్రిమచిలీపట్నం నగరంలో ప్రజలకు మరింత చేరువలో ఆధార్ సేవలు అందుబాటులో వచ్చాయని, ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. సోమవారం ఉదయం మంత్రి మచిలీపట్నం నగరంలోని కొజ్జిలిపేట కెనెడీ రోడ్డులో యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడిఏఐ) ఆధ్వర్యంలో నూతన ఆధార్ సేవా కేంద్రాన్ని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ బండి రామకృష్ణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రస్తుతం ఆధార్ ప్రతి ప్రభుత్వ మరియు ప్రైవేట్ సేవకు అనుసంధానమైందని తెలిపారు. బ్యాంక్ ఖాతాలు, పెన్షన్లు, ప్రభుత్వ పథకాలు, ఇతర సేవలన్నింటికీ ఆధార్ తప్పనిసరిగా మారిందన్నారు. అయితే ఆధార్‌లో మార్పులు చేయించుకోవడం లేదా కొత్త ఆధార్ పొందడం కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు.కృష్ణా జిల్లా ప్రజలకు మరింత సౌకర్యంగా ఉండేలా మచిలీపట్నంలో ఆధార్ సేవా కేంద్రం ఏర్పాటు కావడం అభినందనీయమని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ ప్రాంతాల్లో మాత్రమే ఈ సేవలు అందుబాటులో ఉండగా, ఇప్పుడు మచిలీపట్నంలో కూడా ఈ కేంద్రం ప్రారంభం కావడం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. చలపల్లి రోడ్డులో కాంగ్రెస్ కార్యాలయం పక్కన ఏర్పాటు చేసిన ఈ ఆధార్ సేవా కేంద్రంలో కొత్త ఆధార్ నమోదు, ఆధార్ వివరాల సవరణ, ఫోటో మార్పులు, వేలిముద్రలు, ఐరిస్ అప్‌డేట్ వంటి సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఆధార్ కార్డులో ఎలాంటి పొరపాట్లు ఉన్నా వాటిని సరిచేసుకునేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. కేంద్రాన్ని ఏర్పాటు చేసిన యూఐడిఏఐ సిబ్బంది సంబంధిత అధికారులను మంత్రి అభినందించారు.కార్యక్రమంలో యుఐడిఏఐ డైరెక్టర్ కె.ఎం. భారతి, అసిస్టెంట్ మేనేజర్ వరప్రసాద్, బి.ఎల్.ఎస్ ఇంటర్నేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ సంస్థ జోనల్ మేనేజర్ మనీష్ జవాల్కర్, రీజినల్ మేనేజర్ శ్రీనివాస్ కుమార్, క్లస్టర్ మేనేజర్ హరినాథ్, కృష్ణాజిల్లా ఆధార్ కేంద్రం ఆపరేటింగ్ మేనేజర్ ఎస్ లలిత, మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ (నాని), పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఎముకలు, కీళ్ల సంరక్షణపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి

● ఉద్యోగుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నా. ● ఫారర్మా డైరెక్టర్ ఆళ్ళ లీలారాణి.
● ఫార్మా - హెల్త్ డొమైన్ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన ● 200 మందికి పైగా ఉద్యోగులకు ఉచిత వైద్య పరీక్షలు, మందుల పంపిణీ






**విశాఖపట్నం: మే 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ళ లీలారాణి అన్నారు. ఉద్యోగుల ఆరోగ్యం, భద్రతకు తమ సంస్థ అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. విశాఖపట్నం స్పెషల్ ఎకనామిక్ జోన్ లోని లీ ఫార్మా, లీ హెల్త్ డొమైన్ సంస్థలు హోబెల్ బెల్లోస్ కంపెనీ సహకారంతో ఉద్యోగుల కోసం ఉచిత ఎముకలు, కీళ్ల ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించాయి. ఈ శిబిరానికి ఉద్యోగుల నుంచి విశేష స్పందన లభించగా, సుమారు 200 మందికి పైగా ఉద్యోగులు పాల్గొని వైద్య సేవలు పొందారు. శిబిరంలో భాగంగా ఉద్యోగులకు ఎత్తు, బరువు, నడుము-నెలవు నిష్పత్తి, హిమోగ్లోబిన్, రాండమ్ బ్లడ్ షుగర్, రక్తపోటు, హ్యాండ్ గ్రిప్ స్ట్రెంత్, శరీర ఉష్ణోగ్రత, బాడీ కంపోజిషన్, బోన్ మినరల్ డెన్సిటీ వంటి పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్యులు, న్యూట్రిషనిస్ట్‌లు పరీక్షల నివేదికలను పరిశీలించి ఆరోగ్య పరిరక్షణపై సూచనలు అందించారు. అవసరమైన మందులను కూడా ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ళ లీలారాణి మాట్లాడుతూ, శరీరంలో ఎముకలు, కీళ్ల సంరక్షణకు ప్రతి ఒక్కరూ అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా ఉద్యోగులు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, సరైన ఆహారపు అలవాట్లు అలవరచుకోవాలని కోరారు. వైద్య శిబిరానికి జయలక్ష్మి, సరోజిని సమన్వయకర్తలుగా వ్యవహరించగా, డాక్టర్ రాధిక వైద్య సేవలు అందించారు. న్యూట్రిషనిస్ట్‌లు మాధురి, క్రాంతి, జీఎన్ఎమ్ సిబ్బంది భాగ్యలత, పవని, హోబెల్ బెల్లోస్ సీఓఓ వర్మతో పాటు లీ ఫార్మా, హోబెల్ బెల్లోస్ బృందాలు చురుగ్గా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశాయి.

వార్తా ప్రభ

# హైదరాబాద్

# పారిశుద్ధ్య కార్మికుల పని వేళల సవరణ!!

● ఉదయం 4గ నుండి 11గ వరకు మాత్రమే విధులు
● తీవ్రమైన ఎండలు, వడదెబ్బ మరణాల దృష్ట్యా తీసుకున్న నిర్ణయం ● ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజ్ ఠాకూర్ సమీక్ష మేరకు మేయర్ మహంకాళి స్వామి ప్రకటన

**పెద్దపల్లి/ గోదావరిఖని: మే 25 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి ఎండ తీవ్రత దృష్ట్యా పారిశుద్ధ్య కార్మికుల శ్రేయస్సు కోసం వారి పని వేళలను సవరించారు. కార్మికులు ఉదయం 11 గంటల కల్లా తమ విధులు ముగించాలని ఆయన సూచించారు. ఇటీవల వడదెబ్బ కారణంగా ప్రజలు అస్వస్థతకు గురవడం, వరుస మరణాలు సంభవించడంతో, ఎం.ఎల్.ఎ. ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పరిస్థితిని సమీక్షించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో, పారిశుద్ధ్య విభాగానికి చెందిన సిబ్బంది అందరూ ఉదయం 4:00 గంటలకు విధులకు హాజరై, ఉదయం 11:00 గంటలకు విధులు ముగించుకొని ఇంటికి వెళ్ళిపోవాలని మేయర్ తెలిపారు. విధి నిర్వహణలో ఉన్నప్పుడు కూడా వడదెబ్బ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఎండ తీవ్రత తగ్గేంత వరకు ఈ పని వేళలు అమల్లో ఉంటాయని స్పష్టం చేశారు.

# ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించండి

**డీసీ కి బిజెపి అధ్యక్షులు కైతాపురం జితేందర్ వినతి**



**శేరిలింగంపల్లి,మే 25 (వార్తాప్రభ):**హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పనులను తక్షణమే పూర్తి చేయాలని హఫీజ్‌పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కైతాపురం జితేందర్ డిమాండ్ చేశారు.హఫీజ్‌పేట్ డివిజన్ బీజేపీ ఆధ్వర్యంలో సీఎంసీ-మియాపూర్ సర్కిల్ 48 డీసీ శశిరేఖకు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. హుడా కాలనీలోని మల్లయ్యకుంటను అభివృద్ధి చేయాలని, విద్యావాణి హైస్కూల్ పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని పార్కుగా తీర్చిదిద్దాలని కోరారు.అలాగే హుడా కాలనీ వాటర్ సంప్ ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టి ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని డీసీని కోరినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రమణయ్య, బీజేపీ ఉపాధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు,ఓబీసీ మోర్చా అధ్యక్షుడు నరసింహ యాదవ్, కోశాధికారి పవన్ కుమార్, నాయకులు విజయ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

**ఉప్పలకలవగుంట చెరువుకు 90 లక్షలు.. ఎంపీ బాలసౌరి**



**పెడన మే 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పెడనమండలం లోని ఉప్పలకలవగుంట రక్షిత మంచినీటి చెరువుకు 90 లక్షలరూపాయలు మంజూరు చేయనున్నట్టు బందరు ఎంపీ వల్లభనేని బాలసౌరి చెప్పారు. బల్లిపర్రు గ్రామంలో జరిగిన కార్యక్రమం లో ఆయన ఈ విషయం చెప్పారు. మండలంలో ని సగం గ్రామాలకు ఇక్కడినుంచే తాగునీరు సరఫరా అవుతుందన్నారు. చెరువును పూర్తిగా ప్రక్షాళన చేయవలసి ఉందన్నారు. కాగా ఈ చెరువు తూడు గుర్రపు డెక్కతో నిండిపోయింది. దురవాసన తోపాటు దోమలు కూడా వున్నాయి. ఫలితంగా గ్రామంలోని సమీప గృహాలవారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ నిధులు మంజూరుతో సమస్య పరిష్కార మవుతుందని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# నిజాంపేట్ లో రాజీవ్ గాంధీ నగర్ లో ఉచిత వైద్య శిబిరం ప్రారంభం

**పరిపూర్ణ ఆరోగ్యానికి తరచూ వైద్య పరీక్షలు అవసరం - డా. మురళీ కృష్ణ**



**నిజాంపేట్, మే 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పరిపూర్ణ ఆరోగ్యానికి తరచూ ప్రాథమిక వైద్య పరీక్షలు చేయించుకుంటే అన్నీ విధాలుగా శ్రేయస్కరమని ఎయిర్ ఫోర్స్ విశ్రాంత అధికారి డా. మురళీ కృష్ణ అన్నారు. మానవసేవే మాధవ సేవ గా భావించే డా.మురళీ కృష్ణ బాచుపల్లి మున్సిపాలిటీ నిజాంపేట్ రాజీవ్ గాంధీ నగర్ లోని క్రిష్ మెడ్ స్పెషాలిటీ క్లినిక్స్ లో మహిళలు, సీనియర్ సిటిజన్స్ కు ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక ప్రతీ ఆదివారం ఈ ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని,అయితే ఉదయం 10:30 నుండి 11:30 మధ్య సెల్ 70752 12612 కు ఫోన్ చేసి ముందస్తు అపాయింట్మెంట్ తీసుకోవాల్సింది గా కోరారు. సాధారణంగా మహిళల్లో ప్రతి నెల బాహిష్టు వలన కొందరిలో రక్త హీనత, అలసట, ఆయాసం, రక్తం తగ్గుదల వంటివి చోటు చేసుకున్నాయని అన్నారు. ఈ శిబిరం లో కంప్లీట్ బ్లడ్ కౌంట్ ద్వారా ముఖ్యంగా హీమోగ్లోబిన్, ప్లేట్లెట్స్ కౌంట్ గుర్తించి తగిన పరీక్షలు నిర్వహించి వైద్య సలహాలిస్తామన్నారు.సీనియర్ జర్నలిస్ట్ నిమ్మరాజు చలపతిరావు ఈ శిబిరం లో పాల్గొని డా. మురళీకృష్ణ ను మనసారా అభినందించారు. ముమ్ముందు దశల వారీగా ఈ శిబిరాన్ని విస్తృతం చేయాలని కోరారు.

## పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయంలోఎల్ఓసి అందజేత



**విజయవాడ పశ్చిమ మే 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎమ్మెల్యే సుజనా చౌదరి సౌజన్యంతో ముఖ్యమంత్రి సహాయనిది నుండి మంజూరైన ఎల్ ఓ సీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) ను ప్రజాదర్బార్ లో కూటమి నేతలు అందజేశారు.44 వ డివిజన్ నాలుగు స్తంభాల సెంటర్ కు చెందిన ధనాలకోట రమ్య (38) హెర్నియా తో బాధపడుతూ వైద్యం సాయం కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ 3 లక్షల ఎల్ ఓ సీ ను బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు.త్వరితగతిన స్పందించి ఎల్ ఓ సీ ను అందజేయడంతో బాధితురాలి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే సుజనా చౌదరి కు కృతజ్ఞతలు తెలిపారు..44 వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాసరావు, 39 వ డివిజన్ జనసేన అధ్యక్షుడు ఏలూరు సాయి శరత్, తెలుగు యువత నాయకులు దాడి మురళి కృష్ణ, ఎస్ఐ పీ శివ, పశ్చిమ చిరంజీవి యువతఅధ్యక్షుడు షేక్ మధు మస్తాన్, సుజనా మిత్రా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు..

## గీతా గోవిందం సేవా సమితి చే మెరిట్ విద్యార్థులకు అభినందన



**తిరుపతి, మే 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** గీతా గోవిందం సేవా సమితి వారు నిర్వహించిన పదో తరగతి ఫలితాల్లో మన తిరుపతి జిల్లాకు సంబంధించిన విద్యార్థులు ఎవరైతే, అత్యధిక మార్కులు సాధించిన యాదవ, కురువ విద్యార్థులు ప్రోగ్రామ్ కు 110 మంది వచ్చారు, అతిథులు మరియు సొసైటీ సభ్యులుగా ఉన్నటువంటి ప్రతి ఒక్కరి చేతుల మీదుగా కూడా విద్యార్థులను అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి విద్యార్థులు తోపాటు వారి తల్లిదండ్రులు కూడా అత్యధిక సంఖ్యలో పాల్గొనడం విశేషం. ఈ ప్రోగ్రాంను అనుకున్నప్పటినుంచి ఒక ప్రత్యేకమైన శ్రద్ధతో విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులను కోఆర్డినేట్ చేసుకుంటూ, ప్రోగ్రామును కూడా ఎటువంటి గందరగోళం లేకుండా చాలా చక్కగా నిర్వహించడం జరిగింది. డాక్టర్ సుబ్బారావు మరియు డాక్టర్ గోపి కృష్ణ , మాజీ రిజిస్టర్ శ్రీనివాసులు , ట్రస్ట్ ప్రెసిడెంట్ బాల గురప్ప , పద్మావతి మేడం విద్యార్థిని విద్యార్థులకు చక్కటి సందేశాన్ని ఇవ్వడం జరిగింది మరియు ఇతర ఉద్యోగులు పాల్గొనడం జరిగింది.గీతా గోవిందం సేవాసమితి సొసైటీ సభ్యులకు మరియు దాతలకు నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.లిఈ కార్యక్రమంలో సెక్రెటరీ కాకులూరు గుణశేఖర్, ట్రెజరర్ బి మధుసూధన్, ఉమాపతి , మునీంద్రన్, బడి ప్రసన్న, బట్ట భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ సేవలను అభినందించిన బాదం బాలకృష్ణ





**కాకినాడ, మే 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కాకినాడ సినిమా రోడ్డులో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్--1 పోలీస్ సిబ్బంది సేవలను రెడ్ కాన్వెంట్ స్టూడెంట్స్ (1978) చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు బాదం బాలకృష్ణ అభినందించారు. సోమవారం 45 వేల విలువగల స్టీల్ వాటర్ బాటిల్లు, గ్లూకోజ్ ప్యాకెట్లను అందించారు. ప్రజలకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు చేస్తున్న కృషి ప్రశంసనీయమని తెలిపారు.ప్రత్యేకంగా ట్రాఫిక్--1 సిబ్బంది ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ విధులు నిర్వర్తించడం అభినందనీయమన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా పోలీసులు చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు ప్రజల్లో మంచి స్పందన పొందుతున్నాయని పేర్కొన్నారు.ట్రాఫిక్ సీఐ ఎన్ రమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది సమర్థవంతంగా పనిచేస్తున్నారని, ప్రజల భద్రత కోసం అంకితభావంతో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సిబ్బందికి ట్రస్ట్ తరఫున ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో శీమకుర్తి పాపారావు, ఎస్సై సి కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీలో చేరిన విశ్రాంత ఆర్ఐ కృష్ణమోహన్

### రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పార్టీ కండువా కప్పి ఆహ్వానం.



**చల్లపల్లి,మే 25(వార్తాప్రభ ప్రతినిధి)**చల్లపల్లి మండల ఆర్ ఐ గా పనిచేసి పదవీ విరమణ పొందిన ఘంటసాల కృష్ణ మోహన్ బీజేపీలో చేరారు. ఆదివారం పునాదిపాడు వద్ద జరుగుతున్న ప్రశిక్షణ మహా అభియాన్ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్.మాధవ్ పార్టీ కండువాను కప్పి పార్టీలోకి ఆయనను చేర్చుకున్నారు.ఈ సందర్భంగా కృష్ణ మోహన్ మాట్లాడుతూ ప్రజా సేవ లో భాగంగా మరింత ప్రజలకు దగ్గర అయ్యేందుకు బిజెపి సిద్ధాంతాలను క్రమశిక్షణను గుర్తించానని , పార్టీ సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లేందుకు , పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిరువోలు బుచ్చిరాజు, జిల్లా అధ్యక్షులు తాతినేని శ్రీరామ్, ఘంటసాల మండల అధ్యక్షులు తాళ్లూరి ఫణి హరిప్రసాద్ సమక్షంలో ఆయన పార్టీలో చేరారు.

## ఉచిత సమ్మర్ కోచింగ్ క్యాంప్ ను సందర్శించిన జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి







**హనుమాన్ జంక్షన్,మే25(వార్తాప్రభ)** స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో హనుమాన్ జంక్షన్ లోని బాపులుపాడు సాయిబాబా గుడి రోడ్డులో గల ఐసిఎం జూబ్లీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు టైగర్ పవర్ కిక్ బాక్సింగ్ & కరాటే స్కూల్ వాళ్ళు నిర్వహిస్తున్న ఉచిత సమ్మర్ కోచింగ్ క్యాంప్ ను జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి ఝాన్సీ లక్ష్మి సందర్శించారు.ఆత్మ రక్షణ విద్యలైనా కిక్ బాక్సింగ్,కరాటే, బాక్సింగ్ మరియు ముఖ్యంగా ఆడపిల్లలకు సెల్ఫ్ డిఫెన్స్ వంటివి ఈనెల మే 31 వరకు శాప్ రిజిస్ట్రేషన్ ద్వారా ఉచితంగా నేర్పడమే కాకుండా ప్రభుత్వం ద్వారా నేర్చుకున్నట్టు గుర్తింపు సర్టిఫికెట్ కూడా ఇస్తున్నామని, డాన్స్, పాటలు లాంటివి ఎన్ని నేర్చుకున్నా ఒక క్రీడాకారుడుకి దక్కే గౌరవం దొరకదని అదేవిదంగా నేర్చుకునే విద్యార్థుల సౌకర్యార్థం ఉదయం మరియు సాయంత్రం రెండు బ్యాచ్ లను 5.30 నిమిషాలనుండి 7. 30 గంటల వరకు నడుపుతున్నారని ఈ విషయం లో కోచ్ కట్టా సుధాకర్ కృషి అభినందనీయమని డి స్ డి ఓ మేడం తెలియజేసారు. పిల్లల ఆత్మ రక్షణకు, ఆరోగ్యానికి మరియు క్రమశిక్షణకు ఇవి ఎంతో దోహదపడతాయని ఈ అవకాశన్ని తలిదండ్రులు సద్వినియోగం చేసుకుని తమ పిల్లల భవిష్యత్తుకి మంచి పునాది వేయాలని సూచించి అలాగే ఇలాంటి మంచి పనిని చేస్తున్న ప్రభుత్వాన్ని శ్రవంతి చారిటబుల్ ట్రస్ట్ అధినేత వీరమాచినేని సత్య ప్రసాద్ అభినందించారు. చుట్టు ప్రక్కల గ్రామాలనుంచి పిల్లల తలితండ్రులు వాహనాలను ఏర్పాటుచేసుకుని వస్తున్నారని వారి కృషి అభినందనీయమని ఇదే గొప్ప ఆలోచన అందరి పిల్లల తలిదండ్రులకు కలిగితే ఒక మంచి సమాజాన్ని నిర్మించినవారిమౌతామని కోచ్ కట్టా సుధాకర్ తెలియజేసారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న పెద్దలు మరియు పిల్లలు ఈరోజు పుట్టినరోజు జరుపుకుంటున్న శాప్ చైర్మన్ రవి నాయుడు కి ఆనందం తో అభినందనలు తెలియజేసారు.

## ఘనంగా బిషప్ డాక్టర్ జి. శ్యాంబాబు పుట్టినరోజు వేడుకలు





**గుడివాడ, మే 25 :(వార్తా ప్రభ ప్రతినిధి):** సీనియర్ జర్నలిస్ట్, బిషప్ డాక్టర్ జి. శ్యాంబాబు పుట్టినరోజు సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పాస్టర్ ప్రేయర్ ఫెలోషిప్ (ఏపీపీఎఫ్) కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దేవుని సేవకులు వీర్ల ఆనంద్ రావు ప్రార్థన నిర్వహించారు. అనంతరం సేవకులు శ్యాంబాబుతో కలిసి పుట్టినరోజు కేక్ కట్ చేసారు.ఈ సందర్భంగా ఫెలోషిప్ నాయకులు మాట్లాడుతూ, పాస్టర్ జి. శ్యాంబాబు గత 12 సంవత్సరాలుగా ఉదయకాల ప్రార్థనలు ప్రతి దైవ సేవకుని సంఘాలలో నిర్వహిస్తూ, దైవ సేవకులను ఐక్యపరుస్తూ, సేవకులకు తమ వంతు చేయూతనిస్తూ విశేష సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఆయన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఫెలోషిప్ నాయకులు పాస్టర్లు జి. యెహెజ్కేలు, కె. ఏలీషా,జి.నోవహు బి. సునీల్ కుమార్, కె. ప్రసన్నకుమార్, పి. సత్యం, అబ్రహం, కె. సామ్యేలు, విలియమ్స్, దెబోరా, కరుణాకర్, కుమార్ బాబు, లివింగ్ స్టన్, సత్యం విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. గుడివాడ, గుడ్లవల్లేరు ప్రాంతాలకు చెందిన పలువురు దైవ సేవకులు హాజరయ్యారు.

## జవహర్ నగర్ లోరైతు సంఘం ఆధ్వర్యంలో
# కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం..

### తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల నరసింహులు.



**జవహర్ నగర్, మే 25:(వార్తా ప్రభ)**తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం పిలుపులో భాగంగా జవహర్ నగర్ లో రైతు సంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు డి.జంగయ్య అధ్యక్షతన జరిగింది. జవహర్ నగర్ మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా మెయిన్ రోడ్డుపై కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల నర్సింహులు, మాట్లాడుతూ పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలని గత కొద్ది రోజుల నుండి రెండుసార్లు పెంచిన పెట్రోల్ డీజిల్ ధరల వల్ల రైతులు అనేక ఇబ్బందుల కు గురవుతున్నారు అని సామాన్య ప్రజలు డీజిల్ పెట్రోల్ వాడుకోవాలంటేనే భయపడుతున్న పరిస్థితులు ఏర్పడ్డాయని పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. పంటలకు మద్దతు ధరలను కేంద్ర ప్రభుత్వము అతినామకంగా పెంచడం పట్ల నిరసనగా సోమవారం రోజు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగింది. అని వారు అన్నారు. డాక్టర్ సామినాథన్ కమిషన్ సిఫారసులమేరకు సి సి2050%ఆధారంగా పంటలకు మద్దతు ధరలను పెంచి ప్రకటించాలని నిరంతరంగా తెలంగాణ రైతు సంఘం అనేక సంవత్సరాలుగా పోరాడుతున్న పట్టించుకోకుండా కేంద్ర పాలకులనైజం. కేవలం 72 రూపాయలు మాత్రమే పెంచడం పట్ల తీవ్రమైన నిరసన వ్యక్తం చేశారు. ఇతర పంటలకు కూడా గతంలో ఉన్న ధరల కంటే కేవలం రెండు పైసలు నాలుగు పైసలు పెంచడం సరికాదని వారన్నారు. కేంద్ర పాలకులు నైజం ఏమిటో బట్టబయలైందని పేర్కొన్నారు. కేంద్ర పాలక విధానాలు రైతులకు సామాన్య ప్రజలకు ఎంత వ్యతిరేకంగా ఉన్నాయో అర్థం చేసుకోవాలని వారు కోరారు. అందుకే అక్కడ భారత కిసాన్ సభ పిలుపులో భాగంగా జవహర్ నగర్ లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను నిరసనగా దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మేడ్చల్ జిల్లా నియోజకవర్గ ఇన్చార్జి తోటపల్లి శంకర్, సిపిఐ కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, జిల్లా రైతు సంఘం నాయకులు పి.చంద్రయ్య, ఎన్. చైతన్య, ఏ.సురేష్, గిరిజన సమైక్య ప్రధాన కార్యదర్శి వి.స్వరూప నాయక్, బి కే యం యుజిల్లా నాయకులు నరేంద్ర చారి, పి. నరసింహ, ఏఐటిసి అధ్యక్షులు అంబాల ఎల్లయ్య. వెల్డింగ్ నర్సింగరావు.సైదులు, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగ వితంతువుకు స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో కిరాణా షాపు ఏర్పాటు..



**జవహర్‌నగర్, మే 25: (వార్తా ప్రభ)**సామాజిక సేవలో ముందుండే సుఖినోభవంతు ట్రస్ట్ మరియు పవన్ బాబు మోహన్ చారిటబుల్ ట్రస్ట్ మరోసారి తమ సేవా తత్వాన్ని చాటుకున్నాయి. జవహర్‌నగర్ మున్సిపల్ పరిధిలోని చంద్రపురి కాలనీ, బాలాజీనగర్‌లో ఆర్థిక ఇబ్బందులతో జీవనం సాగిస్తున్న నిరుపేద దివ్యాంగ వితంతువు వరలక్ష్మికి స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో కిరాణా షాపును ఏర్పాటు చేసి సోమవారం ప్రారంభించారు. సుఖినోభవంతు ట్రస్ట్ చైర్మన్ రత్నప్రభ, పవన్ బాబు మోహన్ చారిటబుల్ ట్రస్ట్ కోఆర్డినేటర్ భాను రెడ్డిలు కలిసి సుమారు రూ.20 వేల విలువైన కిరాణా సామగ్రిని అందించి వరలక్ష్మి స్వయంగా ఉపాధి పొందేలా సహకరించారు. ఈ విషయాన్ని వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర జనరల్ సెక్రటరీ మెరుగు శివకృష్ణ ట్రస్ట్ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లగా వారు వెంటనే స్పందించి సహాయం అందించారు. ఈ సందర్భంగా మెరుగు శివకృష్ణ ఆధ్వర్యంలో రిబ్బన్ కట్ చేసి కిరాణా షాపును ప్రారంభించారు. గతంలో కూడా ఈ ట్రస్టులు పేదలకు కుట్టుమిషన్లు, రైస్ బ్యాగులు, వికలాంగులకు వీల్‌చైర్లు, విద్యార్థులకు పుస్తకాలు అందించడంతో పాటు నిరుపేద కుటుంబాల వివాహాలకు పుస్తెమట్టెలు, దశదిన కర్మలకు అవసరమైన నిత్యావసర వస్తువులు అందిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. తనకు ఉపాధి కల్పించి ఆత్మవిశ్వాసాన్ని నింపిన మెరుగు శివకృష్ణ, రత్నప్రభ, భాను రెడ్డిలకు వరలక్ష్మి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుఖినోభవంతు ట్రస్ట్ సభ్యులు సత్యవతి, వెంకటరమణ, సీనియర్ జర్నలిస్టు, బలగం టీవీ సీఈవో విజయ్ కుమార్, స్టార్ట్ న్యూస్ టీవీ9 రఘు తదితరులు పాల్గొన్నారు.

## జడ్పిటిసి మైలా రత్నకుమారి ని ఘనంగా సన్మానించిన వైసీపీ శ్రేణులు....



**కృత్తివెన్ను మే 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కృత్తివెన్ను జడ్పిటిసి మైలా రత్నకుమారి కి ఇటీవల వైఎస్ఆర్సిపి జోన్ 3 ప్రచార విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమితురాలైన సందర్భంగా కృత్తివెన్ను మండల వైసీపీ శ్రేణులు రత్న కుమారిని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జడ్పిటిసి రత్నకుమారి కి కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. రత్నకుమారి మాట్లాడుతూ తనమీద నమ్మకంతో జోన్ 3 వర్కింగ్ ప్రెసిడెంట్ గా ప్రచార బాధ్యతలు అప్పగించినందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, వైయస్సార్సీపి ముఖ్య నాయకులకు పెడన వైఎస్ఆర్సిపి సమన్వయకర్త ఉప్పాల రాముకు తన ఈ నియామకానికి సహకరించిన ప్రతి వైయస్సార్సీపి నాయకులకు కార్యకర్తలకు ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఎన్డీఏ కార్యాలయంలో ప్రజా దర్బార్

### ప్రజల నుంచి వినతులు స్వీకరించిన కూటమి నేతలు...



**విజయవాడ పశ్చిమ మే 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో భవానిపురం ఎన్డీఏ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ లకు విశేష స్పందన లభిస్తుంది.సోమవారం నిర్వహించిన ప్రజా దర్బార్ లో పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలు, వినతులను 39 వ డివిజన్ జనసేన అధ్యక్షుడు ఏలూరు సాయి శరత్,44 వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాసరావు, తెలుగు యువత నాయకులు దాడి మురళి, సెక్టార్-3 ఎస్ఐ పీ శివ మరియు సంబంధిత శాఖల అధికారులకు అందజేశారు..ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా సంబంధిత అధికారుల సమన్వయంతో ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని కూటమి నేతలు తెలిపారు ఈ కార్యక్రమంలో చల్లం రాజు ట్రస్ట్ బోర్డు చైర్మన్ ముదిగొండ శివ, టీడీపీ నేత గూడెల ఉమామహేశ్వరరావు , సుజనా మిత్రా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు...

## "బలరామసేన" ఆధ్వర్యంలో వడదెబ్బ నివారణ మందు మరియు ఉచిత మజ్జిగ పంపిణీ



**పెద్దపారుపూడి, మే 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** "బలరామసేన" ఆధ్వర్యంలో వెంట్రప్రగడ గ్రామం నందు సోమవారం ఉచిత మజ్జిగ మరియు వడదెబ్బ నివారణకు ఉచిత హోమియో మందులు పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమం నందు సుమారు 2000 మందికి మజ్జిగ మరియు 1000మందికి హోమియో మందులు అందించడం జరిగింది. ఈ సందర్భంగా అఖిలభారత యాదవ మహా సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షులు డా. కర్రేటి శ్రీ కృష్ణ మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు ఈ వడదెబ్బకు ఎవరు గురికాకుశీడా ఉండాలని తగు జాగ్రత్తలు సూచించారు. ఈ కార్యక్రమానికి గుడివాడ యాదవ సంఘం అధ్యక్షులు డొక్కు రాంబాబు ముఖ్యఅతిథిగా విచ్చేసి మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు, గ్రామంలోని యువత పెద్ద ఎత్తున సహాయ సహకారాలు అందించారు, లోయ రాజేష్ ,గొరిపర్తి మురళి, మసీముక్కు బాబి, చేయబోయిన దుర్గాప్రసాద్, దిమ్మిటి హర్ష, అంగిరేకుల జగన్పుసునూరి ప్రసన్నకుమార్, పుసునూరి సాయి ప్రకాష్, పుసునూరి నిశాంత్ పూసునూరి నరసింహ, జాజుల కిషోర్, పుసునూరి నవీన్, తోట అనిల్, జాజుల సాయి తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ షేక్ ఇబ్రహీం సస్పెన్షన్..

### డీజీపీకి మహిళ ఫిర్యాదు.. ఎస్పీ చర్యలు.




**మచిలీపట్నం మే 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కృష్ణా జిల్లా మచిలీపట్నం ఇనుకుదురుపేట పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ ఇబ్రహీంను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఓ మహిళ అతనిపై అవినీతి ఆరోపణలు చేస్తూ నేరుగా డీజీపీ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. డీజీపీ కార్యాలయానికి చేరిన ఫిర్యాదును విచారణ నిమిత్తం కృష్ణా జిల్లా పోలీస్ ఉన్నత అధికారులకు బదిలీ చేశారు. ప్రాథమిక విచారణలో వచ్చిన ఆరోపణలను సీరియస్‌గా తీసుకున్న కృష్ణాజిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు, కానిస్టేబుల్ షేక్ ఇబ్రహీంను సస్పెండ్ చేస్తూ చర్యలు తీసుకున్నారు. పోలీస్ శాఖలో అవినీతికి తావులేదని స్పష్టం చేస్తూ ఉన్నతాధికారులు కఠిన వైఖరి ను అవలంబించారు. మరోవైపు, పోలీస్ ఉద్యోగిపై ధైర్యంగా ఫిర్యాదు చేసిన బాధిత మహిళను పలువురు అభినందిస్తున్నారు. అవినీతిపై ప్రజలు ముందుకు వచ్చి ఫిర్యాదులు చేస్తేనే పారదర్శక వ్యవస్థ సాధ్యమవుతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

## విద్యార్థులు ఉన్నత విద్యలో మరింత రాణించాలి

### గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ మోగులూరి ఎలీషా



**ఇబ్రహీంపట్నం,మే 25 (వార్తా ప్రభ ప్రతినిధి):**విద్యార్థులు ఉన్నత విద్యలో మరింత రాణించాలని గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ మోగులూరి ఎలీషా అన్నారు. ఇటీవల పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితా ల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థు లను కేతనకొండ గ్రేస్ మినిస్ట్రీస్ ఆధ్వ ర్యంలో ఆదివారం సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో శక్తివంతమైన ఆయుధాల్లో విద్యఒకటన్నారు. విద్య వెలుగు వంటిదని, భవిష్యత్ కు బలమైన పునాది అన్నారు. భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని కోరుతూ సత్కరించి బహుమతులు అందజేశారు.కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.విద్యార్థులను సత్కరిస్తున్న గ్రేస్ మినిస్ట్రీస్ సభ్యులు కార్యక్రమంలో గ్రేస్ మినిస్ట్రీస్ సెక్రటరీ సుమలత, అబ్రహం, మాణిక్యరావు, యోబు, పెద్దలు పాల్గొన్నారు.

PrinterPublisherand owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. EditorV. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188